# 3

# సంసారం

శ్రీ రామకృష్ణ శారదా పఠన మందిరము
[illegible] రామచంద్ర [illegible]
[illegible]
[illegible] పోస్టు, ([illegible])

అహోబలరావు ఆ కాలేజీకి క్రొత్త లెక్చరరు. అతడు పుదయం లేస్తూనే ఒక అఘాయిత్యపు పనిచేశాడు. తత్పర్యవసానంగా పందొమ్మిది సైకిళ్ళు పాతిక కారులు పావుడజను లారీలు ఒక గ్రోసున్నర రిక్షాలు ఎక్కడివక్కడ సడెన్ బ్రేకులు త్రొక్కుకుని స్తంభించి పోయినై.

అక్కడికి కొంతమంది కార్యశూరులు పోగయ్యారు. వాళ్ళు ఉపన్యాసాలు దంచి సందేశాలు యిచ్చే రకం కాదు. ముఖ్యంగా ఆడ వాళ్ళకు అందులో వయసుల్లో చిన్నవాళ్ళకు ఏదన్నా ఆపద వస్తుందా మనం సేవ చేద్దామా అని కాసుక్కూర్చుంటారు. ఈ అవకాశం ఎట్లా లభించిందంటే—

గవర్నరుపేట జంక్షనులో-లైటుకూడా అంతక్రితమే రావటం వలన పెద్ద స్టేషనునుండి వచ్చే ప్రయాణీకులు మామూలుగా రోజువారీ పనులమీద తిరిగే జనాభా, చిన్నచిన్న సందుల్లోంచి 'కూలీనాలీ' కోసం ఎప్పటికప్పుడు వెతుక్కుంటూ తిరిగే బీదా సాదా, వాహనాధిపతులు అందరూ కలుస్తున్నారు అక్కడ ఆ పుదయం ఎనిమిది గంటలప్పుడు.

అటువంటి మాంచి యమరద్దీలో, పోలీసు కనిస్టేబు తెల్లబోతున్నాడో, అభయహస్త మిస్తున్నాడో తెలియని పరిస్థితిలో, ఓ కాలేజీ భామిని, ఆ గొడుగుకు—కనుమూసి కనుతెరిచేలోగా—రెండు వందల డెబ్బై డిగ్రీల ప్రదక్షిణాన్ని పూర్తిచేసి, అపర సత్యభామా దేవిలా త్రోలుకుపోతున్నది సైకిలును.

అహోబలరావు అప్పుడే కాఫీ నిమిత్తం బయల్దేరి వస్తున్నాడు. స్థానిక దినపత్రికా సాంస్కృతిక వారపత్రికా విలేఖరులు కూడా చూస్తున్నారు, 'న్యూస్' దొరక్క దిగాలు పడి. ఆవిడ జార్జెట్ సిల్కుచీర రెపరెపలు సైకిలు పెడలుతో సరాగాలాడ్డం అహోబలరావు చూశాడు. అతని డబల్‌బ్రెస్ట్ కోటుగుండీ 'ఫట్' మని తెగింది.

"అరెరె!!!" అంటూ విస్తుబోయి రోడ్డు కడ్డంబడ్డాడు.

ఇక ఆ నవీనాంధ్ర యువతి అహోబలరావు ఆశ్చర్యార్థకానికి గుండె చెదిరి, అమాంతం బెదిరి, త్రొక్కుతూ త్రొక్కుతూన్న సైకిల్ని ఎదురుగుండా వస్తూన్న రిక్షాకు రాసి, ప్రక్కనే రోడ్డువారగా పెరుగుతట్ట నెత్తిన పెట్టుకొని తనదారిని తాను పోతున్న ఓ నడివయస్సు గొల్లమనిషిని అమాంతం వెనుకనుంచి ఢీ కొన్నది.

ఒకడు ఆ అమ్మాయిని లేవదియ్యబోయాడు. 'నను ముట్టకు ముట్టకు మని కురుజనంబులలోనికి దూరిన ద్రౌపదియుంబోలె' లేచి దూరంగా నిల్చొని, ఆ చక్కటి విశాలమైన నేత్రాలలో కన్నీటి కదలికల వాగుర ఏర్పడగా, పిండుకోసాగింది చీరెను. మరొకడు ఆ లేడీ సైకిలు హాండిలుకు వంకర్లు సాగదీశాడు. ఇంకొకడు దూరంగా దొర్లి బురదలోపడ్డ పుస్తకాలనేరి, స్వయంగా మడిచి, చేతికందిచ్చాడు. వేరొక ప్రాప్తకాలజ్ఞుడు "టించరయోడిన్" కోసం పరుగెత్తాడు.

తరువాత ఆ అమ్మాయి రిక్షాలో కూర్చుంది.

ఒక పెద్దమనిషి ఆ వంకర సైకిలును ఎట్లాగో నడిపించుకుని వెనక్కాలే వెళ్లాడు.

ట్రాఫిక్ రూల్స్ తెలియని అహోబలరావు "గప్‌చిప్"గా కాఫీ హోటల్లోకి దూరాడు.

ఏ పాపమెరుగని పెరుగుతట్టల మనిషి చెల్లాచెదరైన పిడతల్నీ, ముంతల్నీ యేరుకుంటూ "సదుగుకునే గుంటలకి మొగయేసాలు, ఎదవ కాలమొచ్చి పడింది" అని గొణుగుకొంటోంది.

## 2

**అహోబలరావు**కారోజు దుర్దినం. ఒకటి వెంటొకటి అపశకునాలు, పొరబాట్లు, తుడుపులు కొట్టివేతలూ. దిగాలుపడి కూర్చుండిపోయాడు. హోటలుకొచ్చాక గది తలుపులు తెర్చుకుని కూర్చున్న అతనికి, అలివేలు వ్రాసిన ఉత్తరాలు, తనచేత అన్ని పనులు సక్రమంగా చేయించగల ఆమెలోని చైతన్యశక్తి, అన్నీ ఒక్కటొక్కటే గుర్తుకు రాసాగినై. జేబులోంచి యిదివరకు ఆమె వ్రాసిన ఒక ఉత్తరాన్ని తీసి చదువ నారంభించినాడు.

"నాకు మిమ్మల్ని ఎట్లా కాపాడుకోవాలో ఎవ్వరూ నేర్పలేదు. కనీసం కొన్ని సూచనలనన్నా చేసివుండలేదు. మా నాన్న నాకు కొద్ది చదువే చెప్పించాడు. మా అమ్మ కుంపటి అంటించటం అంట్లు తోమటంలాటి యింటిపన్లే నేర్పింది. నేను నా స్నేహితుల్తో ఆడీ పాడీ, సంగీతము, ముగ్గులు, చింతపిక్కలు, గచ్చకాయలు, త్రాడాట, త్రొక్కుడు బిళ్ళలతోటే వ్యర్థంగా గడిపేశాను నా చిన్నతనమంతా. నాకున్న మిడిమిడి జ్ఞానంతోటే 'అది అట్లాకాదు యిట్లా—యిది యిట్లాకాదు అట్లా—' అంటూ వేధిస్తున్నాను. దాన్నే మీరు నన్ను సంస్కరిస్తున్నారనే పెద్ద ముక్కవేసి నా పరంగా వాడుతున్నారు. 'నాకేమి తెలుసును? నేను చాలా అప్రయోజకుడ్ని' అనకండి. ఎవరికున్న ప్రయోజకత్వం వారికుంది. అంతా మీకన్నా ఎన్నో అంతస్తులు పైనవున్నట్లు మీరు గుణించుకుని భావించకండి. ఎవరైనా పరిహసిస్తూ మాటంటే, అవన్నీ మనస్సుకు పట్టించుకుని బాధపడ్డం భావ్యంకాదు."

ఇవన్నీ ఒకటి వెంటొకటి జ్ఞాపకాని కొస్తున్నై. జరిగిన విషయాలను అక్షరాల్తో పొదిగి అర్ధాంగికి తెలియపర్చటానికి తనకేదో సిగ్గనిపించింది. కాని వెంటనే అ అమ్మాయి విన్నపం గుర్తుకొచ్చింది. "సమర్థురాల్ని గాకపోయినా అప్పుడప్పుడు మీరుపొందే సుఖదుఃఖాల్ని యీ చరణదాసి చెవినిగూడా వేస్తూవుండండి. అందువలన ఎక్కువ ఫలితం వున్నట్లు కనిపించకపోయినా, ఎలుకా సింహామూ కథ గుర్తుకొచ్చి ఒక రకమైన తృప్తి కలుగుతూంటుంది. నేనుకూడా ఏదైనా జేయగల్ను అవసరం వస్తే మీకు అని."

అతనిక వుండబట్టలేకపోయాడు. సొరుగులోంచి కాగితాలు కలమూ లాగి బల్లముందు కూర్చున్నాడు. బలవంతాన కళ్ళల్లో నీరు తిరుగుతున్నా ఆపుకుందుకు యత్నిస్తూ కలంతీసివ్రాయు నారంభించాడు.

"నీకు వ్రాయకుండా యీ నా అసమర్థతవల్లా తెలివితక్కువ తనంవల్లా కలిగే ఫలితాలను నేనే అనుభవిద్దామనుకున్నాను. కాని నీకు ఏ వాగ్దానమైతే యిచ్చానో దాన్ని ఉల్లంఘించే శక్తి నాకు లేదు. క్లుప్తంగా చెప్పాలంటే నువ్వనుకున్నట్లుగానే జరిగింది. మొదట్నుంచీ

జాగ్రత్తగానే వున్నాను. బలహీనతల్నెక్కడా బయలు పడనివ్వలేదు. కాని యీ బెజవాడ ప్లాటుఫారంమీద అడుగుపెట్టిన మరుక్షణంనుంచి అంతా మారిపోయింది. ఏ పనులు చేయవద్దన్నానో అవే చేస్తున్నాను. వేట్నిగూర్చి ఆలోచించి మనస్సు పాడుచేసుకోవద్దన్నావో వాట్నిగూర్చే ఆలోచిస్తున్నాను.

నేను గాబరా మనిషి నవటంవలన ప్రతీదీ ముందే విపరీతంగా వూహించుకుని పప్పులో అడుగు వేస్తూంటాను. ఈ ప్రిన్సిపాలు వన్నెరుగును. ఇదివరకు నేనీయనవద్ద చదువుకున్నాను. కాని పూరా సూటులో వెళ్ళగానే నాకు ఆసనమిచ్చి చాలా మర్యాద చేశారు. నా పేరు చెప్పి 'అర్జీ' చేతిలో వుంచాను. ఆయన ఆశ్చర్యపడి నోరు తెరిచాడు. కాస్సేపటికి నవ్వి కరచాలనంచేస్తూ—'మిస్టర్ అహోబలే, నువ్వు చాలా మారిపోయావే' అని నా అర్జీ అందుకొని రెండేరెండు కాళీలు యింగ్లీషు డిపార్టుమెంటులో ఏర్పడ్డాయనీ, ఒక దాంట్లో ఒక అమ్మాయి దూరిందని, రెండవది కాళీగా వుందని చెప్పారు. నేను సరే అని తలూపాను. ఇక్కడో విషయం వ్రాయటం మర్చిపోతున్నాను. నేనివ్వాళ్టి ఉదయం జంక్షన్లో ఓ అమ్మాయి సైకిలు మీదనుంచి పడిపోవటాన్ని చూశాను. న్యాయంగా చెప్పాలంటే ఆ పడిపోవటానికి నేనే కారణమైనానని వ్రాయటానికి నాకు చాలా సిగ్గుగా వుంది. ఆ మొదటి లెక్చరరు ఆమె కాలేజీకి సైకిలుమీద వస్తూ పోతూంటుందని విన్నాను. కాని ఆవిడను నేను చూడలేదు. అట్లా అసలా స్త్రీ ఎవరో తెలుసుకోకుండానే యీ సైకిలుమీద నుంచి పడ్డ అమ్మాయే ఆ మాతోటి లెక్చరరు అనుకున్నాను. అట్లా ఎందు కనుకున్నావంటే నేనేమీ చెప్పలేను. అహోహపడ్డం మాత్రం జరిగింది.

నాకు రోజుకు సుమారు మూడుగంటల పని. తతిమ్మా సమయాల్లో కాంపోజిషన్ గ్రంథాలు సంస్కరించాలి. నన్ను మొదటి సంవత్సరాని కెళ్ళి 'గద్యం' క్లాసు తీసుగోమన్నారు. అది సులువే—నాకు బాగావచ్చు. కాని యీ గాబరా పోకటాయె—కడుపులోంచి దేవేస్తున్నది. ఐనా నేనెన్నడూ పదిమందిలో ఉపన్యాస మిచ్చినవాణ్ని కాదు. నాలుక పిడచకట్టింది. రెండుసార్లు కాబోలు కాఫీ త్రాగాను.

ముచ్చమటలు పోశాయి. ఒణుకుతూన్న కాళ్ళతో వెళ్ళి కుర్చీలో కూలబడ్డాను. అనేక జతల కళ్ళు నా వైపు తిరిగాయి. చాలా తలకాయలు అలుముకున్నట్లు చట్టిపిడతల దొంతరలాగున అగుపించాయి. ఎట్లాగో అట్టెండెన్సు వేసుకున్నాను. దాన్ని, తగలేస్తే అప్పుడే అవాంతరం రావాలా? మొదటి పాఠం తెరిచి వ్యాసకర్తనుగూర్చి రెండుముక్కలు చెబుదామని గొంతు విప్పబోతున్నాను.

ప్రొద్దున్న సైకిలు మీదనుంచి పడిన ఆ అమ్మాయి పుస్తకాలు ఒకటో అరో పుచ్చుకుని, గుమ్మందాకా వచ్చి నన్నుచూసి ఆశ్చర్యపడి అడుగు వెనక్కువేసి నిల్చినట్లుగా, నాకు తోచింది.

నేనిక్కడే తవ్వుకున్న గోతిలో పడ్డాను. అస్సలామెను సత్కరించకపోయినా బాగుండిపోయేది.

“ఇది మీ క్లాసా?” అని అడిగాను.

“అవును. నా క్లాసే....” అంది మాంఛి పొగరుబోతుతనంగా. చచ్చాన్రా! ఈ అమ్మాయి లెక్చరరు—యీ క్లాసు ఆవిడదే కాబోలు. ఎరక్కపోయి చిక్కడ్డాను యిందులోనని, తెవుల్చుకుందామనే వుద్దేశంతో—

“సారీ! ఇది నా క్లాసనుకున్నాను. టైంటేబుల్లో అలానే వుంది. పొరబాట్లు జరుగుతూంటాయి. మీ క్లాసైతే మీరే తీసుగోండి” అని క్షమాపణలతో పుస్తకం మూసి యివతలకొచ్చి నేరుగా ప్రిన్సిపాలు రూములో కెళ్లాను. యీ అవకతవకల సంగతి ఏదో గట్టిగా కనుక్కుందామని.

ప్రిన్సిపాలుగారు నా అవివేకానికి విసుక్కున్నారు, “నీలో ఏదో మార్పు వచ్చిందనుకున్నాను. నువ్వా మునపట్లానే వున్నావే” అని. తరువాత తెలిసింది—ఆ అమ్మాయికూడా విద్యార్థినేనని, నేననుకున్నట్లు లెక్చరరు కాదని.

నా కిప్పుడిల్లు కదలటానికే సిగ్గుగా వుంది. కదలి బైటకెళ్తే అంతా పకాపకా నవ్వుతున్నారు. ఆడపిల్లలు నేను నడుస్తూంటే “లెఫ్ట్! రైట్!” అని కదం తొక్కుతూ పాడుతున్నారు. నేనందరికీ లోకువైపోయాను. తోటి లెక్చరర్లు నన్ను వేళాకోళం పట్టిస్తున్నారు. ఈ

జానెడు పొట్టను పోషించుకోవటానికి వచ్చినవాణ్ణనే "దయా-జాలి" యీ కాలేజీ కుర్రవాళ్ళలో, కోసినా ఏ ఒక్కడికీ నామీద లేదు.

ఏం చెయ్యను అలివేలూ? అంతా నన్నూ నా బ్రతుకునీ హేళన చేసేవాళ్ళే.

సీ

అహోబలరావు."

## 3

క్లబ్బునుంచి పెందరాలే వచ్చిన ప్రసాదరావు టెన్నిస్ రాకెట్‌ను వూపుగుంటూ మెట్లెక్కి వస్తున్నవాడల్లా ఎప్పుడూ లేని యీ యింట్లో నిస్తబ్ధతకు కొద్దిగా ఆశ్చర్యపడుతూ, బయటే పేము కుర్చీని జాజి పందిరకు దగ్గరగా లాక్కుని అందులోకి ఘటాన్ని జార వేశాడు.

ఈ సమయానికి యిల్లంతా మార్మోగించే రేడియో పలకటం లేదు. మనుష్యులంతా ఎక్కడా కదలడంలేదు. చివరకు యింట్లో ఎవ్వరూ లేరా అని అనుమానం వేసింది. క్షణంలో జాజి పందిరిమీద నుంచి వచ్చే సువాసనకు అతడు యీ అనుమానాలన్నీ కట్టకట్టి ఒక మూల త్రొక్కి విశ్రాంతి ననుభవిస్తూ మెడను కుర్చీమీద వ్రేలాడేసి కళ్లు మూసుకున్నాడు. కళ్ళు మూసుగోవడమేమిటి? ప్రసాదరావుకి పిలిస్తే నిద్రాదేవి వచ్చి వాళ్ళో వ్రాలుతుంది. అతనట్లానే నిద్ర పోయాడు.

వరండాలోని ప్రసాదరావు వరండాలోనే నిద్రపోతున్నాడు. హాల్లోని దమయంతి విసుక్కుంటోంది—

"ఆ క్లబ్బునుంచి యీ పాటికేనా తిరిగివస్తే బావుండును, డాక్టరుకు కబురు చెప్పేవాళ్లులేరు. ఇక నేనైనా వెళ్తాను" అని.

విజయ వుడుకు మోతుతనంగా అంది:

"నువ్వు ఆ డాక్టర్నీ వాళ్ళనీ తీసుగొచ్చావంటే నా మీద వొట్టే అక్కా! ఐతే నా సంగతి నలుగుర్లోనూపెట్టి నన్నేడిపించాలని వుందన్న

మాట మీకు." యీ చివరి ముక్కలంటూన్నప్పుడు విజయ నిజంగా ఏడుపు ముఖమే పెట్టిందల్లే వుంది.

దమయంతి విజయకు దగ్గరసావచ్చి చేతుఁమీద రాస్తూ—

"ఈవేళ ఎంత గండం గడిచి బ్రతికేవే—చెప్పు. ఈ ప్రపంచంలో ఎవరైనా నవ్వుతారని వైద్యం మానుకుంటారా? గోటితో మీటితే పోయేది...."

మాటకు మధ్యలోనే అడ్డం వస్తూ "వీల్లేదే అక్కా, నీకు పదివేల నమస్కారాలు. యీ కథంతా నాచేత అడ్డమైన వాళ్ల దగ్గిరా వాగించాలనుందా మీకు?"

దమయంతి టేబిలుమీద కూర్చొని చెల్లెలి ముఖంలోని రోషానికీ, అభిమానమనే మబ్బు తెరల్లో మునిగిపోయిన ఆమె ముఖ బింబానికీ, తన కర్తవ్యాన్ని కొనసాగ నివ్వకుండా ఆమె ఆడే అర్థంలేని మాటలకీ గొలుసు కట్టుకోలేక లంకె లందక చివరకిలా అనేసింది:

"బావ వచ్చాక యీ సంగతి విని ఆయనేమంటారో—అప్పుడు నీ చేత ఒప్పించి నీ సమ్మతం తీసుకునే డాక్టరుకి కబురు పంపుతారంటావా ఆయన?"

విజయ ఒక్కమాటు వెనక్కు చార్లపడ్డ దిండు గలేబును ఎడమ చేత్తో సర్దుకుంటూ—

"నీకు పుణ్యముంటుంది అక్కయ్యా, జరిగిందేదో జరిగింది. ఇప్పుడైనా నీకు ఎరక్కపోయి చెప్పాను. బావకీ సంగతి తెలియనివ్వొద్దు. అసలే నవ్వుతాలు పట్టిస్తాడు!"

విజయ కేమీ పాలుపోలేదు. ప్రపంచమంతా తన్ను వేళాకోళం పట్టిస్తూన్నట్లు యీ ఉప్పు ఒకరి చేతుల్లోంచి ఒకరికి అందరికీ అందుతూన్నట్లు అందరూ అదే పనిగా నవ్వుతూన్నట్లు తోచి "అబ్బ!" అని కళ్లు గట్టిగా మూసుకుని ముఖం చిట్లించింది.

దమయంతి లేచి "రికార్డులు వచ్చేటయిమయింది. పెట్టమంటావా విజయా?" అంది. విజయ రేడియో కేసిచూసి "పోనీ పెట్టు" అనేసి యీజీఛైరులోంచి లేచి, తన గదివైపు కుంటుకుంటూ ఎల్లానో నడచి వెళ్లాలనుకుని రెండడుగులు వేసింది.

అప్పుడే వరండాలోంచి కళ్ళు నులుముకుంటూ హాల్లోకి వస్తూన్న ప్రసాదరావు "అరే! ఇవ్వాళ విజయ ఎక్కడో బోల్తా కొట్టినట్లుందే? రెండువందల యాభై రూపాయల సైకిలు.. ఇటలీనుంచి తెప్పించాను. స్పేరుపార్టుసుకూడా యిక్కడ దొరకవు."

దమయంతి "చాల్లెండి! మీరు ఇప్పుడనగా దయచేశారు. ఈ వాళ దానికెంత గండం తప్పిందని...."

"అందుకే ఆనందిస్తున్నాను."

విజయ చర్రున వెనక్కి తిరిగి-

"కాలుజారి పడేవాళ్ళు పడుతూవుంటే నవ్వేవాళ్ళు నవ్వుతూంటారు. సంస్కారంలేని మనుష్యులు!"

ప్రసాదరావు పులివేషం విప్పుతూ—"ఈవేళ క్లబ్బులో అడ్డమైన గాడిదా నా ప్రక్కనుచేరి 'సారీ' అనేవాడే. నేను గాదయ్యా పడింది మా మరదలు—నా కెందుకు కండొలెన్సని ప్రతిమాలుకుని యితవతలకొచ్చి పడేసరికి నా తలప్రాణం తోకవరకూ వచ్చిందంటే నమ్మ్మ."

దమయంతి కళ్ళతో చేతుల్తో ఎన్ని విధాలుగా అభినయించి వారించాలో అన్ని విధాలుగా వారిస్తూ—

"మీకు పుణ్యముంటుంది, అస్సలే దానికి ఊరెడంత అభిమానం. మీరూరుకోండి. వేళాకోళాలకి కూడా సమయాసమయాలున్నై...."

విజయ తన గదిలోకి వచ్చి ఫడేలు మనేలా గది తలుపులు మూసి ప్రక్కమీద బోర్లా పడుకుని తలగడలో తలదూర్చి వెక్కి వెక్కి ఏడవనారంభించింది.

"చూశారా! నేననుకున్నంతపనీ జరిగింది" అంటూ దమయంతి కొరకొరా ప్రసాదరావు వంక చూసింది.

ప్రసాదరావు రేడియో ట్యూన్ చేయబోతున్నాడు. దమయంతి నెత్తీనోరూ బాదుకుంటూ—"మీరు యివ్వాళ ఏమిటిల్లాగ ప్రాణం పీకి పిండెడ్తున్నారు? దాని వంట్లో ఏమీ బాగులేదు. ఆ రేడియోని కాస్సేపు వాగించకండి!"

ప్రసాదరావు ఆగి, "నేను సంస్కారం లేని మనిషినిగా మీ

చెల్లెలు యింతక్రితమే చెప్పింది!" దమయంతి 'ఆ' అని వెళ్ళి తువ్వాలు తెచ్చి యిస్తూ "స్నానానికి లేవండి. మీరు నేనూ భోంచేస్తే దానికి ఇన్ని ఓవల్టీను నీళ్ళన్నా కలిపిస్తాను!"

"ఒహో!" ఆ తరువాత మెడలో వేసుకుని చిచ్చి కూడా గొట్ట వద్దూ. నిద్రపడుతుందో పట్టదో అమ్మగారికి. పోనీ ఆ పని నేను చేసి పెడతాను!"

దమయంతి కోపంగా చూసి-"మీ దగ్గర మంచితనం లేదు. ఆ సైకిలు ఇటలీనుంచి తెప్పించాను. ఈవాళ క్లబ్బులో అంతా కండొలెన్స్ చెప్పారు. ఎత్తుకొని చిచ్చిగొట్టు. ఇట్లాటి మాటలాడకపోతే, ఆ వెకిలి పీనుగెవరో కనుక్కోగలిగారు? దారి కడ్డంపడి వెకిలిగా నవ్వి ఆడ పిల్లను బెదరగొట్టాడూ....యిదేనా చదువు? సంస్కారంలేని మనిషి!"

వేణ్ణీళ్ళ చన్నీళ్ళ పాళాలుగా తొలుపుకుంటూ "కాస్త వీపు తోము మై డియ్యర్. ఏమన్నావు? సంస్కారం లేదనా—వాడూ నాకు తమ్ముడల్లేనే వున్నాడు. క్రొత్త గొడ్డు మీ చెల్లెలి విసవిసలకు బెదిరి పోయి దారికడ్డం పడివుంటాడు."

వీపు మీద నుంచి చేతుల్ని తీసివేస్తూ పరుషంగా-

"ఐతే మీరేమీ కలుగు చేసుకోరన్నమాట—ఇవ్వాళ యిట్లా జరిగింది. రేపు రెక్క పుచ్చుకు లాగుతాడు. మనమంతా చూస్తూ వూరు కోవలసిందేనా?"

"కళ్ళు మూసుగుందాం. నేను చిన్నప్పుడు నువ్వు అటూ యిటూ తిరుగుతుంటే రెక్కపుచ్చుకులాగితే ఏం చేసే దానివి? అంతే-ఏదో ప్రణయకలాపమనుకుని తృప్తిచెందాలి!"

"ఛీ! ఛీ! ఛీ! రామ రామ, మీ నోటికి శుద్ధీబద్ధంలేదు" అంటూ ఆ గదిలోంచి చరచరా వెళ్ళిపోయింది.

ప్రసాదరావు పట్టు పంచె చుట్టుకుని భోజనాల సావట్లోకి వెడుతూ విజయ దగ్గర ఆగి, "కొంచెం తలుపు తియ్యవే అమ్మాయీ! పెద్ద అద్దం యిలాగియ్యి- నేను రేపు కనుక్కుంటాను ఆ మహానుభావు డెవడో.... వాడి కోసమని నువ్వు భోజనం మానుకోవడమేమిటి? యిలాగయితే యివ్వాళే తాతయ్యకు కబురుచేస్తాను...."

లోపల విజయ మాట్లాడకుండా ముఖాన్ని ఎర్రబర్చుకుంటోంది.—
ప్రసాదరావు తలుపు గుంజుతూ "ఇదుగో నువ్వు వాడికోసం బెంగపెట్టుకోవడం ఏమీ బాగులేదు. రేపు ఉదయం వాడ్ని తీసుకొచ్చి నీ ఎదట పెడ్తాను. నీ యిష్టం వచ్చినట్లు చేసుకో—తెలిసిందా? ఇకరా. వచ్చి అన్నం తిను."

తలుపు భళ్ళున తెర్చుకుంది. విజయ కస్సుమంటూ—

"ఏమిటి నువ్వనేది? ఆ కోతికోసం నేను బెంగపెట్టుకుంటున్నానా. నువ్వు వాడ్ని తెచ్చి రేపు ప్రొద్దున్న నా కప్పగిస్తావుకదూ. అప్పగించవు మరీ? ఇదుగో యీ అద్దం తీసుక పో. నన్నవసరంగా యేడిపించకండి. నాకు అన్నమూ అక్కర్లేదు. అధ్వాన్నమూ అక్కర్లేదు."

ప్రసాదరావు విజయ అలిగిందని గ్రహించాక మెల్లగా ఉపక్రమించాడు.

"ఇదుగో అమ్మాయ్, నువ్వనవసరంగా ఉద్రేకపడి లాభం లేదు. నన్ను పది తిట్టి నిన్ను పది తిట్టుకొని కాలేజీ మానేసి గొడవ చేస్తే జరిగిపోయింది కలిసిరాదు. నేను అన్నంత పనీ చేసి తీరుతాను—నాకా సన్యాపి ఎవరో తెలవాలి మరి. నేను వాడ్ని ఏ ఉపాయాన్నన్నా వెంటబెట్టుకు రాగలను. ఆపైన మీ అక్క యిష్టం, నీ యిష్టం—వాడికి ఏ శిక్ష వేసినా మీ యిష్టం. కాదనను. సరేనా—"

విజయ ఉరుముల్లోంచి మెరుపుల్లోంచి దిగి చల్లబడి-

"అతను పాపం! క్రొత్త లెక్చరరు...."

ప్రసాదరావు "చచ్చాను. నువ్వే పాపమంటే కథ అడ్డం తిరిగినట్లే. మీ మాట నమ్ముకుని ఏ సాహసం చెయ్యబోయినా చివరకు గాడిదలయేది మగవాళ్ళే- అవునా?"

విజయ అక్కడ్నుంచి చల్లగా వంట యింట్లోకి జారుకుంది. బయటి వరండా చీకట్లో నిలబడి పొంచి వింటూన్న దమయంతి—

"మీరిక్కడ ఏమిటి చేస్తున్నారు?" అంటూ రొక్కించింది.

ప్రసాదరావు "వుండు. డైలమాలో పడి కొట్టుగుంటున్నాను. వన్. టూ. త్రీ. ఈ రెండు వ్రేళ్ళూ పట్టుకో."

దమయంతి ఒక వ్రేలును చప్పున పట్టుగుంది.

ప్రసాదరావు చప్పున గెంతి "డామిట్! మీ చెల్లెలు నన్నే మోసం చేయాలనుకుంది."

"ఏమిటా మోసం?" అంది ఏమీ పాలుపోక.

"దీన్నే మొదటి చూపులో ప్రేమ- లవ్ అట్ ఫస్ట్ సైట్— అంటారు. విజయ ఆ క్రొత్త లెక్చరరుట- వాడ్ని ప్రేమిస్తోంది."

దమయంతి చప్పున నోరుమూస్తూ—"మీకు మతిపోతున్నదల్లే వుంది. ఆ పాడు నవలలు చదవకుండా ఉండలేరుగదా!"

ప్రసాదరావు ఏమరుపాటుగా వున్న దమయంతి రెండు బుజాల్ని గిరుక్కున తన వైపుకు త్రిప్పుకుని, ముఖంలో ముఖం పెట్టి—"ఈ మీ ఆడవాళ్ళు యింతేగావల్ను. పైకి ద్వేషిస్తూన్నట్లే వుంటారు. లోలోపల ప్రేమ మరగ కాగుతూంటుంది. ఈ రోజుల్లో కాలేజీ అమ్మాయిల ప్రేమ కాఫీ హోటళ్ళలో పాలులాంటిది. దానికి మరగ కాగటమేగాని పొంగి పొర్లటమంటూ వుండదు. ఎందుకంటే గంట గంటకీ చెంబెడు నీళ్లు కలుపుతూనే వుంటారుగా!"

ఈ మారు దమయంతి పొట్టచేత్తో పట్టుకొని నవ్వునాపుకోలేక "ఇంక మీరు మాట్లాడకండి. చచ్చిపోతున్నాం యింట్లో వాళ్ళం. మీ షర్‌లాక్ హోంస్ మీరూను" అంటూ వంట యింట్లోకి వెళ్ళింది.

ప్రసాదరావు పీటలమీద కూర్చునే సరికి రెండు కంచాలలోను పదార్థాలు వడ్డించబడి వున్నై.

లోపల దమయంతి విజయ చేతిలోని గరిటను లాక్కోవాలనే యత్నంలో విఫలురాలై వచ్చి ప్రసాదరావు ప్రక్కను చతికిలబడి పోయింది.

ప్రసాదరావు "ఊ-చూస్తావేం? కలుపు...."

ఇద్దరూ అన్నాలు కలిపారు. విజయ మెదలకుండా వడ్డన చేస్తోంది. ప్రసాదరావు పెదిమ కదిపి ఒక్క అక్షరం ముక్కకూడా మాట్లాడలేదు. దమయంతి లేచాక చూస్తే వాన వెలిసిన ఎండ కాసిన సాయంత్రానికి మల్లేవుంది విజయ ముఖం.

## 4

కొత్త లెక్చరరు అహోబలరావుకు అన్నీ క్రొత్త సమస్యలే. ఉదయం ఐదూ ఎనిమిదీ గంటల మధ్య ముక్కూ ముఖం యేకమయ్యేలా కురవకపోతే ఎవరేమనుకొని పోతారో అన్నట్లుగా కొట్టి కురిసింది వాన.

హోటలుకుపోయి పెందరాళే రెండు మెతుకులు నోట్లో వేసుకుని క్లాసుకు తయారవుదామంటే వీల్లేకుండా టిక్కెట్ల పుస్తకం మాయమైంది. శుభ్రమైన దుస్తులేసుకుని నీటుగా పోదామనుకుంటే నేలంతా ఎక్కడా అడుగుదీసడుగెట్టడానికి శక్యంగాకుండా చితపతలాడుతోంది. పిన్నా పెద్దా, ఆడా మగా, అంతా ఆ రొచ్చూ రొంపి దాటటం కోసం లాగుల్ని ధోవతుల్ని చీర కుచ్చెళ్లను కాస్త పైకెగబట్టుకొని ఎత్తిఎత్తి వేస్తున్నారు అంగలు.

డాబా మీంచి చూస్తుంటే, పెద్ద మనుష్యులు కొంతమంది ఏ కూరలకనో మరో పనిమీదో బయలుదేరి వీధిలో కొచ్చి గొడుగుల్నెత్తి పట్టుకు నడుస్తుండగా దారిలో ఎరిగున్న వాళ్లెవరైనా ఎదురు పడ్తే 'ఆముదం' మ్రింగవలసిన వాడిలా ముఖంపెట్టి పల్కరించిన దానికేవో జవాబులిచ్చి వొదుల్చుకుంటూ ముందుకు సాగుతున్నారు.

అహోబలరావుకు వాన కోటు కొనాలన్న విషయం అప్పుడే తట్టింది. పర్సు తీసుకుని జేబులో వేసుకుని గబగబా మెటమీంచిదిగి వీధిలో కొచ్చి పడ్డాడు. ఆ తొందరలో అతను అకు చెప్పు లేసుగొచ్చాడు. రోడ్డుమీద నడుద్దామంటే 'బంయ్' మంటూ అట్నుంచి ఒక బస్సు, యిట్నుంచి బస్సు, పోనీ పేవుమెంటుమీద ఎల్లాగో సర్దుకు పోదామంటే అక్కడక్కడ చెప్పులు గుట్టేవాళ్లు, గొడుగులకు ప్రాత కలాలకు టోపీలు పాళీలు అమర్చి, కళ్ళజోళ్ళూ తాళం చెవులు మరమ్మతు చేసి జీవించే చిల్లర వ్యాపారులు, వేరు శనక్కాయలమ్ముకునే ముసలమ్మలు, వీళ్లతో నానా అవస్తగానూ వుంది.

ఇక యీ పట్టణాల్లో బ్రతకటమే ఒక అవస్థ. ఇట్లాటి వానలో ఒకరి మడమలొకరు త్రొక్కుకుంటూ పరుగెడ్తున్నారు జనం. చెట్ల

బజారులోని ఫ్యాన్సీ గుడ్సు షాపులోకి అటువైపునుంచి అహోబలరావు, యిటునుంచి ప్రసాదరావు ఒక్కమాటే ప్రవేశించారు.

షాపులో జనం గొడుగుల్ని బేరమాడుతున్నారు. అక్కడకూడా నేల తేమగా వుంది. తీరా వాన కోటు కొందామని వచ్చిన అహోబల రావుకు గొడుగుల్ని చూడ్డంతోనే, అదీ-యిదీ ఏది కొనటమనే డైల మాలో పడిపోయాడు.

ప్రసాదరావుని చూడగానే కొట్టు యజమాని "దయచెయ్యండి సార్! చూస్తావేరా వెధవా, పంతులుగారికి కుర్చీవెయ్!" అంటూ జనాన్ని వొత్తిగించుకుని "ఏమిటి యిలా దయచేశారు? కాఫీ పుచ్చుకుంటారా? బోయ్, టిఫిన్ ఒక కప్పు కాఫీ పట్రా చప్పున" అంటూ అతి మర్యాద చేశాడు.

"కాఫీ ఏమిటి? ఏమీ అక్కర్లేదు. ఇప్పుడే పుచ్చుగొచ్చాను. నన్ననవసరంగా చంపకు" అన్నాడు ప్రసాదరావు క్రొత్తరకపు ఫ్యాన్సీ కళ్ల జోడుతీసి విలాసంగా చేత్తో పుచ్చుగుని. లెనిన్ బుష్‌కోటు వేసు కున్న ప్రసాదరావును, అతడి జేబులోని పార్కరు పెన్ను, బెంటిక్సు చైనుతోవున్న వెస్టెండ్ కొత్త మోడలు వాటర్‌ప్రూఫ్ రిస్టువాచీని చూచిన అహోబలరావు వుండబట్ట లేక ప్రక్కవాడ్ని పొడిచి 'ఎవరీ యన' అని అడిగాడు.

"ఎక్కడో పశ్చిమ గోదావరిజిల్లాలో పంచదార ఫ్యాక్టరీ కడ్తు న్నారు. దానికి మేనేజింగు డైరెక్టరు. ఇంకా మన వూళ్ళో చాలా కంపె నీల్లో ఆయన షేర్లున్నాయి."

ఇది విన్నాక "పశ్చిమ గోధావరి జిల్లాలో పంచదార ఫాక్టరీ పెడు తూంటే యీ మేనేజింగు డైరెక్టరు యీ వూళ్ళో ఎందుకు వుండటం" అనుకుని, పోనీలే మన కెందుకని ఆ కొట్టు యజమానిని 'వాటర్‌కోట్లు' చూపించమని అడిగాడు. అప్పటికి అహోబలరావుకు కాలేజీకి వెళ్ల టానికి గంట వ్యవధే వున్నది.

ప్రసాదరావు కాఫీ పీలుస్తూ "చూడవోయ్. ఓవల్టీను డబ్బా ఒక టిన్నూ, ధర్మాప్లాస్కు పగిలిపోయింది అదొకటి యివ్వు!"

"చిత్తం" అని ఆ సరుకుల్ని స్వయంగా తెచ్చి అందిస్తూ

"ఏం బాబూ యింట్లో అంతా కులాసా?" అన్నాడు కొట్టు యజమాని.
ఈ ప్రశ్నకు ప్రసాదరావు సమాధానం నోటినుంచి పెగిలి బయటకు రాకముందే, సైకలు షాపు డీలరు బంగారయ్య "పంతులుగారూ, శేడీ సైకిలు తీసుకున్నారు. ఇంకా కొరవ మిగిలిపోయింది. కొంచెం యిబ్బందిలో వున్నాను. లేకపోతే తమబోటి వారి దగ్గర సొమ్ము ఖజానాలో వున్నట్టే...." అంటూ లోపలి కొచ్చాడు యితడి రాక పసిగట్టి.
అవతలకొట్లో చిన్నచిన్న బేరాలన్నీ గుమాస్తా చూసుగుంటున్నాడు.
ప్రసాదరావు కొంచెం విచారంగా "ఆ సైకిలు తుక్కుతుక్కయిందోయ్. కుర్రాడ్ని పంపించు. యిచ్చేస్తాను. మళ్లీ అమ్మేసి వొచ్చిన డబ్బు నాకిచ్చేద్దుగాని...." అన్నాడు కళ్ళు తేల్చి పైకిచూస్తూ.
"ఏమిటి అలా అంటున్నారు. ఏం జరిగింది?" అంటూ కుతూహలంగా ప్రశ్నించాడు బంగారయ్య. ప్రసాదరావు కొంచెం అయిష్టంగా "అది కొన్న వేళావిశేషం మంచిది కాదోయ్. నిన్న మా మరదలు దానిమీంచి పడిపోయింది. ఆక్సిడెంటు సీరియస్ కాదుగాని దెబ్బలు తగిలాయి."
అహోబలరావు గుండె చప్పున ఆగిపోయింది. "చచ్చాన్రా యిక్కడకొచ్చిపడ్డాను. ఆ క్రొత్త లెక్చరర్ని నేనే అని తెలిస్తే యీ మేనేజింగు డైరెక్టరు నా ముఖం బోర్లేస్తాడు గావల్ను. ఎట్లా యిక్కడనుంచి తప్పించుకోవడ"మనే భయంతో గబగబా బిల్లు చెల్లించి వీధిన పడ్డాడు. అతని కళ్ల చీకట్లు కమ్మాయ్. 'పట్టుగోండి!' అని ఎవరో అరుస్తూ వెంబడిస్తూన్నట్లు తోచింది.

## 5

గోదావరి స్టేషన్లోకి మెయిలువచ్చి, ఆగీ ఆగటం సుందరరామయ్య భోషాణంలాంటి పెట్టెను కూలీల సహాయంతో కిటకిటలాడ్తూ కిక్కిరిసివున్న ఆడవాళ్ల పెట్టెలోకి ఎల్లానో నెట్టి ముఖంమీదిచెమటను తుడుచుకుంటూ—"ఎక్కమ్మా, ఇది ఆడవాళ్ల పెట్టె. ఎల్లానో రెండు గంటలసేపు కళ్ళు మూసుగున్నావా, బెజవాడ స్టేషను వొస్తుంది"అని సామాన్తో

నింపిన గోనె సంచీని ఎక్కడ వుంచటమా అన్న ఆలోచనతో పెట్టి లోకి తొంగి చూశాడు.

అలివేలు క్రొత్త చీరకట్టుగుంది. కాళ్లకు రాసుకున్న పసుపూ, స్టేషనుకు వచ్చే ఆదరా బాదరా తొందరలో వాళ్ల అమ్మ ముఖాన మెత్తిన కుంకుమా, చేతిలోని చలిమిడీ, పసుపు కొమ్ముల సంచీతో లోపలకు ఎక్కబోతూ చేయిపట్టుకునే వూచకు తగలటం వలన రెండు గాజులు చితికాయి. లోపల ఎవరో స్త్రీ సానుభూతిగా- 'అయ్యో చిట్టెమ్మా గాజులు చితికాయ్——' అంటూ సర్దుకొని చోటిచ్చి, గుమ్మానికి కడ్డంగా వేయిస్తున్న సామాను సంచీని విమర్శిస్తూ 'దారికడ్డమయ్యా-ఎక్కే వాళ్లకూ దిగేవాళ్లకూ ఎట్లా?' అని గొణిగి, 'బుల్లెమ్మా మీ పుట్టిల్లు ఏ వూరు' అంది అదే వరసని. అలివేలు ఆవిడ దయారసానికి కృతజ్ఞతగా 'ఈ వూరేనండీ' అని, 'నాన్నా, ఆ సామానులోపల సర్దించు దారికడ్డం లేకుండా-పాపం ఎక్కేవాళ్లకూ దిగేవాళ్లకూ....' అని అనటం, ఆ స్త్రీ మర్యాదగా 'ఫరవాలేదమ్మా. ఆ సామాను నీదా? అత్తారింటికి కాబోలు వెళ్తున్నావు. ఆయన మీ నాన్నగారా....' అంది. 'అవునండీ' అని అలివేలు కిటికీలోంచి తండ్రికేసి చూసింది. సుందరరామయ్య లోపలికొచ్చి సామాన్ను దారికడ్డం రాకుండా సర్ది—— 'మర్చిపోయాను, యిదిగో టిక్కట్టు జాగ్రత్తమ్మా. అతను స్టేషనుకు వస్తాడు. ఇప్పుడే టెలిగ్రాము యిస్తాను. అమ్మా, కాస్త మా అమ్మాయి బెజవాడ స్టేషన్లో దిగుతుంది. చూస్తూండండి' అని ఆ స్త్రీకి వప్పగించాడు.

రైలు కదిలింది. అలివేలు పెట్టిలోంచి ఆకాశం వైపు, మరొక సారి తండ్రివైపు చూసింది. ఆకాశం స్వచ్ఛంగా వుంది. ఎక్కడా మబ్బులు లేవు. ఎండ బంగారంలా వుంది. తండ్రి ముఖం దమ్మిడీ కాసంతయింది. తండ్రి చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ 'ఉంటానమ్మా' అంటున్నాడు. అలివేలు తెలతెలబోతూ తలను పెట్టెలోకి లాక్కుంది. పెట్టెలో తొడ త్రొక్కిడిగా వుంది. రైలు గోదావరి దాటుతోంది. గోదావరిని చూడ్డంకోసం దంతావళంలాటి మనిషి అలివేలు మీదనుంచి త్రోసుకుంటూ కిటికీలోకి మెడను దూర్చాలని ప్రయత్నిస్తోంది. ఆవిడ కూర్చున్న చోటు ఒక చదరపు గజం మేర. అందులో చుట్టూ

అరడజను బత్తాయి కాయిల తొక్కలు వొల్చి పారబోసింది. వెనకాల పల్చటి దిండు అనుకుందుకు వేసుకుంది. ప్రక్కనే ఒక యింగ్లీషు పత్రిక రెండు మూడు కథల పుస్తకాలు ఉన్నై. మీద కొక్కికి థర్మాఫ్లాస్కు వేలాడుతోంది. బహుశా ఆ కథలు చదువుతూ మధ్యమధ్య ఆవిడ అందులోని పానీయాన్ని కొద్ది కొద్దిగా ఆరగిస్తూ వుండాలి. అలివేలు కావిడ ధోరణి నచ్చలేదు. పెట్టెలో యింకా రకరకాల ఆడవాళ్ళు నిల్చునే పిల్లల్ని ఎల్లానో వూరడింపుకొంటున్నారు. ఆవిడ ఎక్కువ తన సుఖం చూచుకునే మనిషిలా కనుపించింది. అట్లాటి వాళ్ళంటే అలివేలు కన్నల్లు కోపం. పైపెచ్చు ఆవిడ తన వర్తుల దేహాన్ని తన మీదుగా పోనిచ్చి గోదావరిని చూసి ఆనందిస్తోందంటే చిరాకు వేసిన మాట మాత్రం నిజం.

రైలు ధనాధనా మంటోంది, వంతెనమీద. అలివేలుకు తలనొప్పి.. ఆవిడ వక్షఃప్రదేశం అలిమేలు ముఖానికి రాసుకుంటూ ఉక్కిరిబిక్కిరి చేయడంవలన, 'ఊపిరాడ్డంలేదండీ' అంది విసుగ్గా. కండలు తిరిగి ముడతలుపడ్డ ఆమె మెడను అలివేలుకేసి త్రిప్పుతూ 'ఇప్పుడనగా ఎక్కేవు. ఈ మాత్రానికే యింత చిరాకా—నేను ఎక్కడ్నుంచి వస్తున్నానో తెలుసునా?—నిన్ననగా ఎక్కేము!'

"అదంతా అనవసరమండీ. మీరు ఎప్పుడెక్కితే నా కెందుకు? నాకు ఊపిరాడ్డంలేదంటున్నాను. దయచేసి మీ సీట్లోకెళ్ళి కూర్చోండి!" అని ముఖం చెండుకునే అనేసింది.

ఇంతవరకూ ఆవిడ నిన్నటినుంచీ ఆ పెట్టెలో ఏకఛత్రాధిపత్యంగా పరిపాలన సాగిస్తోంది. కాని యిటువంటి అవమానం జరగలేదు. అదీగాక అలివేలు చాలా వేదుషంగా అన్నమీదట ఆవిడ మెదలకుండా సీట్లోకెళ్ళి తన చదరపుగజంమేరనూ తిరిగి ఆక్రమించుకుని ఒక బత్తాయి తొనను కోపంగా వొలిచి నోట్లో వేసుకుని గింజల్ని తపుకు తుపుకున వూస్తూ కథలపుస్తకం తీసి ముఖాని కడ్డంగా లాక్కుని కోరచూపులు చూడసాగింది.

కొవ్వూరు స్టేషనొచ్చింది. అక్కడ వో పచ్చిబాలెంతరాలు రెండు నెలల గ్రుడ్డును తీసుకుని ఆ పెట్లోకే ఎక్కింది. ఎక్కడా చోటు లేదు.

ఈ దంతావళం చక్కగా బాసింపట్టు వేసుకు కూర్చొనుంది. ప్రక్కనే ఒక మనిషి కూర్చునే చోటులో పత్రికలు పుస్తకాలూ పర్చింది. ఎవరూ ఆమెను ఆ చోటు ఖాళీ చెయ్యమని అనరు. ఆ పచ్చి బాలెంతరాలుకు నోరు లేదు. అట్లానే నిలబడింది. ఆ పసిబిడ్డతో ఆవిడ ఉదుకష్టంగా నుంచోవటం యీ దంతావళం చూసింది. చూసినా చలించలేదు. మళ్ళీ అలివేలు కలుగచేసుకోవాల్సి వచ్చింది.

"ఇదుగో ఏమండోయ్, మిమ్మల్నే...." ఆవిడ ఉలకలేదు. పలకలేదు. తన్ను కానట్లు వూరుకొంది.

"ఆ పుస్తకాలు కొంచెం తియ్యండి.........అక్కడ కాస్త చోటుంది" అంది మళ్ళీ అలివేలు. ఈ మారు ఒకమాటు తనకేసి చూసి మళ్ళీ నిర్లక్ష్యంగా పుస్తకం చదువుకోనారంభించింది. అలివేలు లేచి ఆ బాలెంతరాలు చెయ్యి పుచ్చుకుని లోపలికంటా నడిపించుకొచ్చి ఆ పుస్తకాలను చేత్తో తీసింది. ఆ దంతావళం 'అవి అక్కడ పెట్టు ముందర' అంటూ గర్జించింది. అలివేలు ఆ బాలెంతరాలు చేతిలోని పసిగుడ్డు నందుకుంటూ 'నువ్విక్కడ కూర్చో' మని ఆ పిల్ల తల్లిని ఆజ్ఞాపించింది. "కూర్చోవటానికి వీల్లేదు" అంటూ దంతావళం చేత్తో ఆ తల్లిని నెట్టివేయటానికి సాహసించింది. అలివేలు కళ్ళవెంట నిప్పులు కురిపిస్తూ, "ఇదుగో బాగా చూడండి. మీరు కనుక ఆమెను కూర్చోనియ్యకపోతే యీ చేతిలోని పుస్తకాలను కట్టగా కిటికీలోంచి అవతలకు గిరాటు వేస్తాను" అని చేత్తో పుస్తకాల దొంతరను ఝళిపించింది. పెట్టెలోని తతిమ్మా ఆడవాళ్ళు గొల్లుమన్నారు. ఆ ముక్కలన్న తరువాత అలివేలు అంతపనీ చేసేదానిలాగునేవుంది. ఆవిడ చప్పున నోరు తెరిచి పెట్టెలో అందరివంకా చూస్తూ—"నేను ఎప్పుడనగా బయల్దేరానో, ఎక్కడ్నుంచి వస్తున్నానో తెలుసా?" అంది. అంతా మళ్ళీ గొల్లుమన్నారు. ఈమారు అలివేలుకూడా నవ్వింది. బాలెంతరాలు చేతిలోని పాపాయి కూడా నవ్వింది. ఈ మారు పరాజయం దంతావళినిదే. ఆ బాలెంతరాలు కూర్చుని ఓపిగ్గా చంటిపిల్లకు పాలు కుడుపుతూ "పది కాలాలుపాటు చిరంపత్తి కలిగి, పసుపూ కుంకుమా పెట్టుగుని బతుకు తల్లీ!" అంటూ దీవించింది.

దంతావళం వూరుకోలేదు. నసుగుడు ఆరంభించింది. 'పారేస్తుం దిట, పుస్తకాలు పారేస్తే పోలీసులకి కబురు చేసేదాన్ని' అంది. పెట్టెలో ఒకమూలనుంచి ఒక తూర్పావిడ చుట్ట నోట్లోంచి తీసి—"బాలింత రాలు కూకోటానికి సోటెట్టమని ఆ మా తల్లి అడిగితే పెద్ద నాపరాయిలా బల్లసంగానికి తాటించి కూకుని, నెగమంటే పిలుస్తాదిట పోలీసుల్ని, ఎదవ పుస్తకాలు ఎన్ని సదిగితేం, ఆ మా తల్లికున్న గ్యానం నేదు: చీరామ చీరామ, కలికాలం" అంది. ఈలోగా గుడ్డి బిచ్చగాడు రైల్లో కెక్కి—

'నిజము కల్లవుతుంది, కల్ల నిజమవుతుంది.

నిజము నిలకడమీద తెలవాలి బ్రహ్మావో—

భజగోవింద! గోవింద!' అంటూ పాట లంకించుకొన్నాడు. దంతావళానికి ఓపిక చచ్చి 'బ్రూట్సు' అనేసి ఫ్లాస్కులోనీ కాఫీ గిద్దెడు పోసుగుని చప్పరిస్తూ కథల పుస్తకం పేజీలు తెరిచి, బలవంతాన చదవటం నటించసాగింది రోషంతో. తాడేపల్లిగూడెం స్టేషన్లో యీ దంతావళానికి మరొక ఐరావతం ప్రోగయింది. అలివేలు వారి సంభాష ణలనుంచి తెలుసుకున్న దేమిటంటే యీవిడ అల్లుడుగారింటికి బెజవాడ వెళ్తోన్నదనిన్నీ-అక్కడ తన చిన్న కూతురు కాలేజీలో చదువుకొంటు న్నదనీ—ఆ అల్లుడు పంచదార ఫ్యాక్టరీ మానేజింగు డైరెక్టరట. ఈ సంగతులు ఆవిడ చెప్పటంలో ఎంతో దర్జా, గొప్పతనం అనుభవిస్తూ చెప్పింది.

కొంతసేపు యీ దంతావళమూ, ఆ ఐరావతమూ యింగ్లీషులో అలివేలుకేసి కొరకొరా చూస్తూ ఏమో మాట్లాడుకున్నారు. తరువాత బెజవాడ స్టేషనొచ్చేవరకూ అలివేలుకు యీ రెండు జంతువులే కాల క్షేపం.

బెజవాడ స్టేషను వస్తున్నదనగానే పొంగిపొర్లే ఉత్సాహంతో అలివేలు ప్లాటుఫారంకేసి ముఖాల్లోకి పరీక్షగా అదుర్దాగా చూడసాగింది. దూరాన్ని రంగురంగుల లైట్లతో స్టేషనంతా దీపాల్తో జగజ్జేగీయ మానంగా వుంది.

ఆ దంతావళం అలివేలు పెట్టెను కొంచెం అడ్డంగా వున్నదనే నెపంమీద "కాళ్ళ కడ్డం వెధవ పెట్టి" అని కసిదీరా తిట్టింది. అలివేలు వూరుకోలేదు. "వెధవపెట్టె గిధవపెట్టె అనబోకు పోలీసుల్ని పిలుస్తాను" అంది. మళ్ళీ అంతా గొల్లుమని నవ్వారు. రైలు ఆగింది. అహోబలరావు కిటికీదగ్గర్నుంచి అలివేలు బుజం తట్టాడు. ఉలిక్కిపడి "మీరా...." అంది. "వచ్చావా" అన్నాడు. కళ్ళు మిలమిలా మెరుస్తుండగా యింత చేసుగున్న ముఖంతో "వచ్చాను" అంది అలివేలు.

ఆ దంతావళంకోసం వచ్చిన విజయ, తల్లిని ముందు పల్కరిందకుండా "బావా! బావా! ఆయనే మా క్రొత్త లెక్చరరు" అని ప్రసాదరావుకు అహోబలరావును చూపెట్టింది.

## 6

**చేలంకడ్డంపడి** పొలాల్లోంచి రెండెడ్ల బండిని త్రోలుకెళ్ళినట్లుగా దంచుతున్నాడు ఉపన్యాసం అహోబలరావు. విషయం సత్యాహింసలు—గాంధీ, గౌతమ బుద్ధుడు. పాఠం అక్కరలేనివాళ్ళు బందరు లైను మీద బల్లిలా పాకుతున్న గూడ్సు రైలు పెట్టెలను లెక్కపెడుతున్నారు. ఉపన్యాసం డొంక తిరుగుడుగా వుంది. అవసరమైన విషయాల్లోంచి అనవసరమైన విషయాల్లోకి దాంట్లోంచి దీంట్లోకి, కప్పదాట్లు, కుప్పిగంతులు వేస్తుంది. ఐనా ఏదో సమర్థతతోనే చెప్పుగుపోతున్నాడు. కొందరు కుర్రవాళ్ళు కబుర్లు ప్రారంభించారు. కొంత కొంతమంది మెల్ల మెల్లగా గోడవారల్నుంచి జారుకొంటున్నారు. ఇంకా మరికొందరు ఉండుండి 'చుట్టా బీడీ సిగరెట్' 'చా! చా! గరం చా!' అని కేకలేస్తున్నారు. అహోబలరావు చప్పున నీరసించి యిట్లాగన్నాడు—"మీ కెవరికీ విషయంపట్ల ఆసక్తి వున్నట్లు కనపట్టంలేదు. ఐనా చదువుకోటానికి వచ్చినట్లు లేరే...." అని. వెనక బెంచీలోంచి 'చాలా చక్కగా గ్రహించారు' అని యింకొక మూలనుంచి 'బాగు బాగు' అని, వేరొకచోటునుంచి "ఈవాళ్టికి చాల్లెండి మాస్టారూ!" అని సలహాలు, సందేశాలు, ఆదేశాలు వచ్చినై. ఆడపిల్లలు నవ్వ

తున్నారు. వాళ్ళు ఎందుకు నవ్వుతారో వాళ్ళకే తెలియదు. అహోబలరావు మళ్ళీ పట్టుదలకొద్దీ ఉపన్యాసాని కందుకున్నాడు. తక్షణం విషయం 'ప్రపంచశాంతి'తో ముడిపెట్టబడింది. ఆర్థిక శాస్త్రానికి సంబంధించిన, రాజకీయాలకు సంబంధించిన ప్రశ్నలు లేచి తలొక్కరూ వేయసాగారు. చివరకా క్లాసు పరశురాం అయ్యన్ సర్కస్‌గా మారింది. అహోబలరావు కుర్చీ వదిలి బెంచీల మధ్యకొచ్చి గర్జించాడు, "మీరు గొడవమానుతారా లేదా?" అంటూ ఒకటికి రెండుసార్లు. హోలోమంటూ అంతా లేచి "క్రొత్తమాస్టారికీ జై!" అంటూ యివతలి కొచ్చిపడ్డారు.

ఖిన్నవదనుడై అహోబలరావు యివతలకు రావటం, మెట్ల దగ్గర బయాలజీ హాల్లో జూ ఆలజీ ప్రాక్టికల్ చేస్తున్న విజయ చూసింది. చూసి ప్రక్కనున్న స్నేహితుల చెవిలో ఏమో చెప్పింది. అంతా అహోబలరావు సమీపాన్నుంచి పోతుంటాన్ని కనిపెట్టి పకపక నవ్వారు. హాలుహాలంతా పకపకలతో ధ్వనించింది. అహోబలరావు కోపంగా విజయకేసి చూశాడు. విజయ కటువైన మంచి హాసాన్ని విసిరింది.

"చాల్లేవే—ఏమిటా విసురుడు?" అంటూ వచ్చింది ఒకతె.

"అదికాదే—క్రొత్తవాళ్ళనంత బెదరగొడ్తావేమే విజయా!" అంది మరొకతె. అంతా నవ్వారు.

బల్లమీద చెక్కకు నాలుగువైపులా మేకులు దిగగొట్టి వెల్లకిలా పరుండబెట్టిన కప్పకు రక్త ప్రసారమెట్లా జరుగుతుందో చెప్పి, గుండె చలనం గూర్చి చెబుతున్నాడు. విజయ పరధ్యానసగా వుంది. సన్నటి చాకులు, చిన్న చిన్న సూదులు నీళ్ళలోంచి తీసి తుడుస్తూ "మాటే ఇందిరా" అని పిలిచింది. ఇందిర నోట్సు వ్రాయటం ఆపుచేసి "ఏమిటే అంత అర్జంటు?" అంటూ వచ్చింది.

"లేడీస్ కల్చరల్ అసోసియేషన్ ప్రారంభోత్సవం ఎప్పుడే?" అంది.

"ఆ విషయం యిప్పుడెందుకే?" అంది ఇందిర.

"పనుందిలే. చెప్పు, ఎప్పుడు ప్రారంభించటం?" మళ్ళీ రెట్టించింది.

"ప్రిన్సిపాల్నడగాలే....ఇవాళ మధ్యాహ్నం పోయి అడుగుదామా?"

విజయ ఆలోచించి "శెక్రటరీని పిలవ్వే...." అంది.

శెక్రటరీ వచ్చి "ఎందుకే విజయా....అవతల టేబిల్ దగ్గర సగం సగం ప్రాక్టికలు చేస్తూ వచ్చాను. చెప్పు" అంది.

"మన అసోసియేషన్ 'డే' ఎప్పుడు చేద్దామే...." అంది విజయ.

"ఇప్పుడెందుకే ఆ చర్చ?" అంది శెక్రటరీ.

"ఆఫీసు బేరరుగా నేను క్రొత్త లెక్చరర్ను సూచిస్తాను. మీరంతా వోట్లియ్యాలి."

"ఎందుకే—పాపం అతడ్ని యేడిపించటం?" అంది ఇందిర.

శెక్రటరీ అందుకుంది. "పాపం అంటూ వెనకేసుకొస్తోంది. దీనికేమన్నా మేనత్త కొడుకేమోనేవాడు!"

విజయ "అల్లానే వుంది. కాకపోతే యేమిటి?" అంది హేళనగా.

ఇందిర కోపంగా "ఆ దగ్గర వరసలన్నీ ఐతేమీకవాలి? నాకేం-నేను నా వోటు వెయ్యను!"

"ముడిచి తల్లో పెట్టుకో...." అంది శక్రటరీ.

ఇందిరకు కోపమొచ్చి తన బల్లదగ్గరకు వెళ్ళి ప్రాక్టికలు చేస్తోంది. విజయ చాకులు, సూదులతో బల్లమీద కప్పను పైపైన కోస్తూ, శక్రటరీ చెవులో ఏమేమో చెప్పి నూరిపోస్తోంది. ఇద్దరూ మధ్య మధ్య నవ్వుకుంటున్నారు. విజయకు ప్రాక్టికల్ మీద దృష్టిలేదు. శక్రటరీ బల్ల మీదకు వంగి విజయ ముఖంలోకి చూస్తూ మాట్లాడుతోంది. ఈలోగా సగం సగం తెలివిలోకి వస్తున్న కప్ప పోయేప్రాణంకోసం పెనుగులాడుతూ, నాలుగు కాళ్ళనూ కుంచించి తిరుగుబాటు చేసింది. క్లోరోఫారం పట్టుతప్పి కప్ప నాలుగు మేకున్ని ఎగరతన్ని శక్రటరీ ముఖానికొచ్చి గుద్దుకుంది.

"అమ్మ బాబోయ్" అని శక్రటరీ భయంతో కెవ్వుమని కేకేసి, వెనక్కు పరుగెత్తింది. విజయ తెల్లబోయి చూస్తూ నిలబడిపోయింది. నాలుగువైపుల్నించి విద్యార్థులు, అధ్యాపకులు, అటెండర్లు "ఏమిటి, ఏమిటి" అంటూ పరుగెత్తుకొచ్చారు.

భయపడిపోయిన శక్రటరీ యేడుపు లంకించుకుంది. అధ్యాప కుడు అటెండర్ని కేకలేస్తే, అతను "పొరబాటు క్షమించాలి. క్లోరోఫారం సరిగా యివ్వలేదు కాబోలు" అని నసిగాడు. విజయ శక్రటరీని నడిపించుకుని వెయిటింగురూంలోకి వెళ్ళబోతూంటే అందరూ 'యీ అమ్మాయి ముఖంనిండా బట్టలనిండా యీ నెత్తురేమిటి, మరకలేమి' టని అడిగేవారే! అడిగి తెలుసుకున్నాక పొట్ట చెక్కలయ్యేలా నవ్వే వారే!

ఇందిర అవకాశంకోసం కాచుక కూర్చున్నది. విజయ, శక్రటరీ, జట్కాలో ఎక్కుతూండగా 'ఏమో-యినాగరేషన్ 'డే' ఎలాగుందేం?' అంది.

శక్రటరీ ముఖమంతా నలుపు చేసుకుంది. విజయ "ఇప్పుడా, యిదా వేళాకోళానికి సమయ" మన్నట్లు చూసింది.

ఇందిర మాటలో మాట కలిపింది— "జరిగిందేదో జరిగింది కాని— యింకెప్పుడూ అనవసరంగా మనకు సంబంధంలేని విషయాల్లోకి దిగి యితరుల్నవమానించటానికి పన్నాగాలు పన్నకండి." దీంతో శక్రటరీ చచ్చిపోయింది. విజయ వుడుకుమోతుతనంగానే అంది— "నీకు మహా బాగా తెల్సులేవే—అందర్నీ వెనకేసుకొచ్చి మాట్లాడుతున్నావ్. ఇవాళ ఏదో ఆ వెధవ క్లోరోఫారం సరిగా యివ్వనందుకు ఆ కప్పకు తెలివొచ్చి మేకుల్ని ఎగరగొట్టిందని దానికీ దీనికీ ముడిబెడ్తున్నావు. వాడెంత రోగ్గో నీకు తెల్సా—నన్ను సైకిలుమీద నుంచి పడేశాడు. నిన్న మా అమ్మ కలకత్తానుంచి వస్తుంటే రాజమండ్రిలో ఎక్కిందట—యీయనగారి భార్యామణి మాట్లాడేవంటే నీ మూటాముల్లే కిటికీలోంచి గోదావరిలో పారేస్తానని బెదిరించిందట. ఇద్దరికిద్దరే. వీడికీ వీడి పెళ్ళానికీ బుద్ధి చెప్పాలి" అని.

శక్రటరీ అంది మళ్ళీ—"ఒసే ఇందిరా- నీ వనవసరంగా దీంట్లో జోక్యం కలుగచేసుకోకు. వాళ్ళిద్దరికీ బుద్ధి చెప్పందే మేం నిద్రపోయేది లేదనుకో—"

ఇందిర మళ్ళీ కప్ప సంగతి గుర్తుకు తెచ్చుకుని పకపకా నవ్వుతూ "నా కెందుకు జోక్యం—నేను కలగచేసుకుంటే ఆ కప్ప ఎగిరి నా మీదే

పడివుండేది యిందాక" అంది. ఇంతలో సిటీ బస్సు వచ్చింది. ఇందిర బస్సులోకి వెళ్ళింది. "ఇదేమిటే యింత పెడసరంగా సెక్స్ సింపతీ కూడా లేకుండా మాట్లాడుతుంది" అంది శక్రటరీ. చెన్నాకోలు "చళ్" మంది. కారు హారన్ 'బంయ్' మంది.

## 7

రోజులు గడుస్తూన్న కొద్దీ చిత్రవిచిత్రమైన సంఘటనలు జరుగుతూ వచ్చాయి. ప్రపంచంలోని ఒక రకపు అసందర్భపు మనుషుల్లో ఒకడైన అహోబలరావు 'బాహ్యజీవితం' దినదిన గండం, వెయ్యేళ్ళాయుస్సుగా మారిపోయింది. ఉపాన్యాసాలివ్వటం మొదట్లో క్రొత్త అనిపించినా క్రమంగా కొన్నాళ్ళకు మామూలై పోతుంది అందరికీ. ఇతడి విషయంలో అట్లాకాలేదు. చిన్నచిన్న అడ్డంకులు సంఘటనలు వచ్చి వ్యక్తిని నిరుత్సాహ పరిచాయి. తరువాత క్లాసంటే భయం, దడ ఎక్కువవుతూ వచ్చింది. కాని తగ్గలేదు. చక్కగా కష్టపడి అవీ ఇవీ చదివి మరీ వెళ్ళేవాడు—కాని నోరు విప్పనివ్వరే! ఖర్మ.

ఇంటికొచ్చాక పెద్ద పెట్టున రాగాలెట్టాలనిపించేది అతనికి. ఎవరితో మాట్లాడకుండా దిగాలుపడి కూరుండి పోయేవాడు. అర్ధరాత్రి నిద్రలోంచి ఉలిక్కిపడిలేచి 'భయం' అనేవాడు. 'నా చేయి మీ మీద వేస్తాను. మీరు సుఖంగా నిద్రపొండి. మీకెందుకు భయం' అనేది అలివేలు.

ఒక రోజున గదిలో కూర్చుని కాంపోజిషన్ పుస్తకాలు సంస్కరించటానికి బదులుగా రెండు చేతుల్తో తల గట్టిగా పట్టుకొని వెక్కివెక్కి యేడవటాని కారంభించాడు. అలివేలు వంట యింట్లో కాఫీ కాచటంలో నిమగ్నురాలైంది.

మరో పది నిముషాలకు కాఫీ కప్పు బల్లమీద వుంచుతూ "కళ్ళు ఎఱ్రగా వున్నాయేమండీ?" అంది చకితవదనయై. అహోబలరావు ఉత్తరీయంతో కళ్ళద్దుకుంటూ "ఏమీలేదు" అని కాఫీ కప్పునందుకుని రెండు గ్రుక్కలు పీల్చి ముఖాన్ని ప్రక్కకు త్రిప్పి కిటికీలోంచి ప్రొద్దుగ్రుంక

టాన్ని తిలకించసాగాడు. పడకకుర్చీ వెనక్కు వచ్చి నిల్చొని "నామీద వొట్టే....ఏమీలేదూ?" అంది రొకాయిస్తూ అలివేలు.

ప్రక్క వాటాలో వాళ్ళమ్మాయి యేడ్చి మారాం చేస్తూంటే— 'ఉల్లిల్లా హాయీ! యేడువకు యేడువకు వెర్రి నాగన్నా! యేడిస్తే నిన్నెవరు యెత్తుకుంటారు?' అని తల్లి వోదారుస్తోంది. అలివేలు కాస్సేపు నిశ్శబ్దంగా నిల్చొని "దీపం వెలిగించు కొస్తాను. ఆనక చెబుదురుగాని లెండి. అన్నం పడేస్తాను" అని గిరుక్కున వంట యింట్లోకి మళ్ళింది.

అహోబలరావుకు వెనుకటి సంగతులు ఎంతవద్దనుకున్నా జ్ఞాపకానికి రాసాగిన్నై. అలివేలు తన్ను యేరికోరి వలచి చేసుకుంది. చెంపకు చేరడేసి కళ్ళు—పిల్లా....ఆహోబలరావు కివ్వడమేమిటి అన్నారంతా. ఆనర్సయితే చదువుతున్నాడుగాని, ఎక్కడా ప్రాపంచిక జ్ఞానం, తెలివీ తేటా, అందం, మనిషిలో నావళికంగానిలేవు. కాకి ముక్కుకి దొండపండు కట్టినట్లు ఏమిటిది? అంటే అలివేలు సమాధాన మిచ్చింది: "నాకు అందం అక్కర్లేదు. ఎక్కడన్నా అందాన్ని కొరుక్కుతింటామా? అది యివ్వాళ వుంటుంది, రేపు పోతుంది. ఈవాళ నలకూబరుడులాటి వాడ్ని తెచ్చి కడతారు. రేపు ప్రొద్దున్న వాడికే మశూచికమన్నా రావచ్చు. అప్పుడా అందమంతాపోతే—అటువంటి అందాన్నే చూసి పెళ్ళిచేసుకున్న నాగతేం కాను?" అంది పెళ్ళికూతురు.

ఇది మాటలునేర్చిన కుక్క, యిస్కోమంటే యిస్కోమంటుంది అన్నారంతా. తల్లి అడిగిందట—'ఆ స్తిమాట్లో—లక్షణమైన బంగారపు బొమ్మలాటి పిల్లనిస్తే, తిండి బట్టా యిచ్చి సుఖపెట్టేచోటు అవునో కాదో కాస్త చూసుకో నక్కర్లేదుటే....' అని. అప్పుడు కూడా అలివేలు కొంటె మాటలు మానలేదు.

"డబ్బుకూడా అట్లాంటిదేగా అమ్మా. అది యివ్వాళ వుంటుంది. రేపుపోతుంది. రోజూ మనం ఎంతమందిని చూడ్డంలేదు. లక్షాధికారులు భిక్షాధికారులు కావటంలే—"

తల్లికి ఆ త్తరువులో కారంవేసి రాచినట్లైంది. దాన్తో ఆవిడ చిరాకు పడింది. "ఈ అడ్డదిడ్డం మాటలన్నీ చెబుతున్న దానివి నువ్వు నిజానికి మొగుడుతోటి కాపురం చేసేదానివేనా?" అని.

అహోబలరావు అనుకున్నాడు—ఋణానుబంధం వుండేచోట అన్ని ముళ్ళూ త్రెంపుకుందామన్నా తెగవు. లేనిచోట ఎంత అతుక్కుందామని భగీరథ ప్రయత్నం చేసినా అతకదు. ఆ ఆశలు గగన కసుమాలుగానే వుంటాయి. ఎవరి చేతి మెతుకులు ఎవరికి ప్రాప్తో, ఏ పిట్ట ఏ పిట్టతో కలిసి గూడు కడ్తుందో చెప్పటానికి నిజంగా యెవరికి తెలుసు?

ఎలిమెంటరీ స్కూల్లో చేరినప్పటినుంచి ఆనర్స్ క్లాసు పూర్తయే వరకూ యీ పది పదిహేనేళ్ళలోనూ ఒకే ఒక రకపు మనస్తత్వాన్ని పెంపొందించుకున్నాడు అహోబలరావు. జీవితం పొడుగునా అపహాస్యాలకు, స్నేహితుల వెక్కిరింతలకు, వేళాకోళాలకు బలి ఔతూ వచ్చాడు. అంట కత్తెరలోంచి క్రాపింగ్‌వరకూ వచ్చినా డబుల్ బ్రెస్ట్ కోటువేసినా, ట్వీడు సూటువేసినా అతనూ అతడి నడకనూ శత యోజనాల దూరం నుంచి దుర్భిణీవేసి చెప్పవచ్చు. ఇంటర్మీడియేటు వరకూ అతను హాస్టల్లో త్రికాలాలూ సంధ్య వార్చేవాడు. అక్కడికి మెస్ రెండుమైళ్ళ దూరం వుండేది. ఈ రెండు మైళ్ళూ పెద్దాపురం పట్టు పంచె బిళ్ళగోచీ పెట్టి తడి ఉత్తరీయాన్ని బుజాన్నేసుగుని చేతిలోని రాగిచెంబుతో భోజనానికి శ్రీ మల్లవరపు వల్లభరాయుడు గారిలా బయల్దేరి దారి వెంటబడి పోతూవుంటే, ఆ పిలక గగన సీమల్లో సంచారం చేస్తూ వుంటే, క్రొత్తగా మొదటి సంవత్సరంలో చేరిన వాళ్ల దగ్గర్నుంచి, పైనలియ్యరు వరకూ ఆడ-మగా అన్న విచక్షణ, భేదం లేకుండా అంతా నమస్కారాలు చెల్లించి భక్తితో త్రోవ యిచ్చేసేవారు. కొందరు భక్తగణంలోని వారు అతడ్ని అక్కడే నిలేసి లెక్కలూ గ్రట్రా తెలియనివి చెప్పించుగుని మరీ వదిలేవారు.

అహోబలరావు రామానుజులవారి మతానికి హృదయాన్ని అంకితం చేశాడు. విష్ణుచిత్తీయము అతడు తలక్రింద పెట్టుకుని నిద్రపోయే గ్రంథం. అహోబలరావు విశిష్టాద్వైతి కూడా—పరబ్రహ్మైక్యతను చచ్చినా వప్పుగోడు. చరిత్రకారులు. కొంతమంది కాలేజీలో చదువుకునే రోజుల్లో అహోబలరావుకు 'ప్రవరాఖ్యుడ'నే గౌరవనామం వున్నట్లు కూడా చెబుతారు. అతను అన్ని తరగతుల్లోను ఉత్తమ

శ్రేణిలోనే వచ్చాడు. కాని ఆనర్స్‌లో సెకండుక్లాసు. అక్కడే వచ్చింది గట్టి చిక్కు. విశిష్టాద్వైతం కొంపతీసింది.

ఆచార్య శివశంకరరావుకు ఎవరో చెప్పారు, అహోబలరావు ఎంత సూపర్‌స్టిషస్ మనిషంటే అతను నడుస్తూన్నప్పుడు శివ శివా! అనిగాని, హరహరా! అనిగాని ఎవరైనా అన్నట్టయితే చెవులు రెండూ మూసుకుని వినపడనంత దూరం పరుగెత్తుతాడని. ఆయన ఒకరోజు స్వయంగా పిలిచి 'నా పేరేమిటి చెప్ప' మని అడిగాడు. 'హరి హరీ' నేను చెప్పనన్నాడు అహోబలరావు. ఆరునూరు గానీ నూరారుగానీ నేను శైవ నామోచ్చారణ చేయనన్నాడు. అతడు తిరునామాన్ని తీర్చి దిద్దితే యమ్. యస్. యమ్. రైలుపెట్టె మీది పట్టీ వర్ధనాలకన్న ఎక్కువ స్పష్టంగా గోచరించేది. చివరికా విశిష్టాద్వైతమే అతడి ఫస్టు క్లాసు కతడ్ని దూరంచేసి మరీ వదిలింది. ఐతే యూనివర్శిటీకల్లా ఫస్ట్‌గా రేంకులో నిల్చోవలసినవాడికి ఫస్ట్‌క్లాసు రాకపోగా, మెడపట్టుకు గెంటితే సెకండు క్లాసు గుంపులో కొచ్చి పడ్డట్టు తెలియగా ఆ తెలిసిన రోజుల్లోనే అహోబల్లరావును గంజికావిడేసి రైల్లో కెక్కించాల్సినంత పనయింది. తరువాత కొద్ది రోజులకేగా జరిగింది కాన్వొకేషను. అప్పటికీ ఫస్టుక్లాసు రాలేదేమా అన్న విచారం మానవుడ్ని పట్టుకు వదల్లేదు. ఉద్యోగం దొరికాక యిప్పుడా విచారం మాయమైంది. దాని స్థానే లోకంలో బ్రతకటానికి, జీవితయాత్రను సరిగా వెళ్ళబుచ్చటానికి ఒక యూనివర్శిటీ డిగ్రీలే చాలవని, ఎన్నో సుళువులు మెలకువలు మాయలు మోసాలు కుతంత్రాలు నేర్చుకోవాలని, లేకపోతే అధోగతి అన్నది నిశ్చయమే అని తేలింది.

అలివేలు దీపం వెలిగించుకొచ్చి—"ఇంకా యిక్కడే కూర్చున్నారే? షికారుకు పోలేదా—" అని ఆశ్చర్యంతో అడిగింది.

"ఇటు రా కూర్చో!"

అలివేలు మాట్లాడకుండా వచ్చి కూర్చొని "ఎందుకండీ అంత దిగాలుపడి పోయి కూర్చున్నారు యింట్లో.......యివాళ మీ అమ్మమ్మ యేమన్నా జ్ఞాపకానికొచ్చిందా?" అని చెంగుచాటు చేసుకొని నవ్వింది.

అహోబలరావు అలివేలును తాకుతూ—

"ఇక మనం అమ్మమ్మనే జ్ఞాపకం చేసుకుంటూ కూర్చోవాలి."

"ఏం అలా అంటున్నారు?" అని తన చేతిలోకి అతడి చేయిని తీసుకుంటూ అంది.

అంత అందమైన కళ్ళల్లోకి చూస్తూ—"నేను చెప్పలేను. చెప్పి నీ మనసు కూడా పాడుచేయలేను" అన్నాడు సంశయంగా.

"నా మనసు మీ మనసులాటిది కాదుగా" అంది అలివేలు.

"ఏమైనా పాడవుతుంది. ఎందుకు చెప్పడం?"

"చెప్పకపోతే దాచుకోండి. లెండి భోంచేద్దాము."

"నాకాకలిలేదు. నువ్వు తిను."

"మీరు తినకుండా నే నెప్పుడెన్నా తిన్నానూ?"

"ఇవాల్టికి తిందూ—నా మనసు బాగులేదన్నానుగా."

"ఏమిటి, ఆ విజయ అన్న అమ్మాయి యేమన్నా చేసిందా?" అలివేలు నవ్వు నాపుకుందుకు యత్నిస్తూ ప్రక్కకు తిరిగి అంది.

"ఏమి చెయ్యాలో అదే చేసింది. ఐనా అమ్మాయిననవలసిన పనే ముంది. మన ప్రారబ్దమే అట్లాగుంది. ఈయనేం చెప్పటంలేదనీ యీయన మాకు అక్కర్లేదంటూ డెప్యూటేషన్ వెళ్ళారు. ఉద్యోగం వుంటుందో వూడుతుందో తెలీదు. ఇటువంటప్పుడు అన్నం యెట్లా సయిస్తుంది చెప్పు?"

"వోస్—యింతేనా!" అంది అలివేలు.

"ఏం యిది చాలదా?"

"అది కాదండీ—మీ కెందుకు కోపం. ఉద్యోగం వెయ్యటం కష్టంగాని తియ్యటం అంత తేలిక కాదు."

"ఓహో—నీకు బాగా తెలుసు."

"అబ్బ! నాకు తెలుసండీ. మీకేం ఫరవాలేదు. వచ్చి భోం చేయండి."

"నేను తన్ను చాలాసార్లు అవమానించటానికి ప్రయత్నించినట్లు ఆ అమ్మాయి రిపోర్టులో వ్రాసింది" అన్నాడు దిగాలుగా.

అలివేలు గది ప్రతిధ్వనించేటట్లు నవ్వి—"మీరా- మీరునిజంగా అటువంటిపన్లు చేశారా?" అంది.

"నే నెప్పుడూ చెయ్యలేదు. చెయ్యను."

"అవమానించటానికి ప్రయత్నించటమంటే?"

"నా బొంద—నే నెప్పుడూ ఆ అమ్మాయి ముఖంలోకి చూసి నవ్వనన్నా నవ్వలేదు."

"మీరు నిజంగా అట్లా చూసి నవ్వివుంటే కథ యింతవరకూ రాక నేపోను."

"అలివేలూ—ఏమిటే వేళాకోళం? యిది ఎటువంటి సమయం - రేపు మనం ఎక్కడ తల దాచుకోవాలి? ఆ ఆలోచన వచ్చేసరికి బుర్ర పగిలిపోవలసిందే—."

"ఏమిటండీ—బుర్ర పగిలేది? నిజంగా తన్ను అవమానించే ప్రయత్నాలు మీరు చేస్తున్నట్లు ఆ అమ్మాయి వ్రాసిన రిపోర్టు నాధారం చేసుకొని మీ మీద చర్య తీసుగుంటారనా?"

"వో తప్పకుండా."

"అప్పుడు చక్రం అడ్డువెయ్యలేనో...."

"ఏమిటి నువ్వా?" అన్నాడు కుర్చీలోంచి లేచి అహోబల రావు.

"అవును. నేనే. ఆ అమ్మాయి దగ్గరకు వెళ్ళి నా ఆడదనం చూపి గెల్చుక వస్తాను. మీ కోసం నే నేది చెయ్యలేను?"

అహోబలరావు, "ఊ నా చేయి పట్టుకో—"

అలివేలు తలుపులు తెరిచివచ్చి "అందివ్వండి" అంది.

"ఇదుగో—అమ్మయ్య, యిప్పుడు కుర్చీలోంచి లేచాను. ప్రాణం ఎంత తేలిగ్గా వుంది."

వంట యింట్లోకి నడుస్తూ "ఉంటుంది. మీకు నిజంగా ఆ పిల్ల అంటే అంత భయమేమిటండీ?"

"భయం కాకపోతే—ఆ అమ్మాయిని రెండు చెవులూ నులి వెయ్యమనా, గోడ కుర్చీ వేయించమనా ఏమిటి నీ అభిప్రాయం?"

"అంతకన్నా ముఖ్యమైన శిక్షే వుంది. గట్టిగా రెండుచేతుల్లోకి తీసుకుని నలిపేసివుంటే, ఆ అమ్మాయి యిట్లాటి పెంకె పన్లు ఎప్పటికీ చెయ్యకుండా వుండేది."

పీట వాల్చుకుని కూర్చుంటూ "ఆ పని నేనే చెయ్యాలనా?—"

అలివేలు కంచం ఎత్తిపట్టుకుని "నిజంగా, మీరే ఆ పని చేసి వుంటే నా కెంత గర్వంగా వుండేదని."

"ఊరికే పైకంటావు. నేను చెయ్యనని, చెయ్యలేనని తెలుసు గనుక."

అలివేలు నవ్వి "అందరికి మల్లే అసూయపడతాననా—ఒక్కనాటికీ పడను. మీరా పనిచేసుండి. మళ్ళీ ఆ అమ్మాయి...."

"ఛ....ఛ....నే నన్నుందగ్గర్నుంచి లేచిపోతాను, నువ్విట్లా మాట్లాడావంటే."

"మాట్లాడను లెండి. ఈ పచ్చడి కలుపుకోండి. ఇది మీ కిష్టమని చేశాను."

పచ్చడి నాలిక్కి రాచుకుని "నీ చెయ్యి దివ్యమైన రుచుల్ని పుట్టిస్తోంది. ఉండు నా బుజంమీద చెయ్యేస్తావేమిటి? అదుగో వాళ్ళెవరో కిటికీలోంచి చూస్తున్నారు."

"పోండి, ఎవరూ లేరు. అంతా అబద్ధం. ఇవ్వాళ నేను మడి కట్టుకోలేదు, తెల్సా?"

"చిత్తం. గ్రహించా" నన్నాడు అహోబలరావు. చందమామ వెన్నెలలు విరియించాడు. సన్న జాజులు నవ్వినై.

## 8

తెల్లారి లేస్తూనే "యీవాళ నన్ను మాట్లాడించకండి. మీ పన్లు మీరు తెచ్చుకోండి. నాకూ పన్లున్నాయ్. ఇంటికి తాళంవేసి మధ్యాహ్నం అలా వెళ్ళి వస్తాను. కొంచెం పర్మిషను యిస్తారూ?" అంది అలివేలు.

"విషయం చెప్పు" అన్నాడు టూత్‌బ్రష్ తిరగేసి తల బరుక్కుంటూ—

"అసలు విషయం ముందు చెబితే కథ ఎప్పుడన్నా రక్తి కడ్తుందీ?" అంది కాఫీకోసం కుంప టంటిస్తూ అలివేలు.

"ఇప్పుడు నువ్వు నాకేమిటి కథ చెప్తావ్?"

"మంచి కథ. అనగాఅనగా ఒక అబ్బాయి వున్నాడు. ఆ అబ్బాయి ఒక మంచి నాజూకైన అమ్మాయిని సైకిలు మీంచి పడగొట్టాడు. అప్పట్నించి వాళ్ళ మనస్సుల్లో రాగద్వేషాలు రాజు కొంటూనే వున్నాయి."

అహోబలరావు పౌరుషంగా, "నేను నువ్వు చెప్పే కథ వినదల్చుకోలేదు. నీకు ఆ కథలో సంబంధంలేదు."

"సంబంధం లేదంటే మీకు వుద్యోగం వూడుతుంది."

"ఐతే యింతకీ నువ్వేమిటి చెయ్యదల్చుకున్నావు. ఇల్లిల్లూ వెతుక్కుంటూ వెళ్తానన్నమాట. నా అవస్థ నేనేదో పడ్తాను. కావలిస్తే క్షమాపణ పత్రం వ్రాసి యిస్తాను. నువ్వెందుకు? నీకు పుణ్యముంటుంది—ఎక్కడికీ వెళ్లొద్దు."

"అనవసరంగా మీరా అమ్మాయికి క్షమాపణ పత్రం వ్రాసి యిచ్చి, మర్నాడు మీరా కాలేజీలోనే పాఠం చెప్పదల్చుకున్నారా? అట్లా ఒక్కనాటికీ జరగటానికి వీల్లేదు. నేను వెళ్ళి మీ విజయను కల్సుగుని మాట్లాడి వస్తాను. మీ తరఫున నాకు వకాల్తీ యివ్వమని ప్రార్థిస్తున్నాను. ఎందుకు మీ రింకా ఆలోచిస్తున్నారు? యేమిటా సంశయం?"

"ఏమీలేదు. బ్రహ్మదేవుడు నన్నే భార్యను చేసి, నిన్ను భర్తను చేసివుంటే ఎంతబాగుండి వోయేది అని."

అలివేలుకి కోపమొచ్చి యింట్లోకి వెళ్ళిపోయింది. తరువాత మాటాడుకోలేదు అరగంటసేపు.

అలివేలే ఆ యుద్ధాన్ని రాజీలోకి తెచ్చే ఉద్దేశ్యంతో "ఇదుగో, మిమ్మల్నే. మన యీ వాదనలో కూరల మనిషి కేక వినిపించుకోలేదు. కూరలటండి బజారుకెళ్ళి, ఎట్లా తెస్తారో చూస్తాను" అంది.

అహోబలరావు సంచీ పుచ్చుకు వీధిలోకొచ్చి 'ఎట్లా తెస్తారో చూ స్తుందిట. నాకేమి అంత లౌకిక జ్ఞానం తక్కువా?'అంటూ మార్కెటు

వరకూ సాగిపోయాడు విసా విసా. వెళ్తూ యిలాగనుకున్నాడు. 'ఏదన్నా హెచ్చు దగ్గులువస్తే అలివేలు తప్పకుండా చెప్పుతుంది. కూరల వాళ్ళు తనది క్రొత్త మొహమని ధర వెక్కువ చెబుతారో, తప్పుడు తూకాలు తూస్తారో—అట్లాటి వేషాలు తన దగ్గిరా? హనుమంతుడి ముందు ఎవరన్నా కుప్పిగంతులు వెయ్యగలరా?' ఇట్లా అనుకున్నప్పుడు చొరుచు కొచ్చిన ఆవేశంతో ఎదురుగుండా కనిపిస్తూన్న ఒకటి రెండు కూరల దుకాణాల ప్రక్కనుంచి కాళీ సంచీ నలుగురిక్కనిపించేలా వూపు గుంటూ ఒకసారి నడిచాడు. అమ్మకం జోరులో—వో వైపునుంచి గోనె క్రిందకు డబ్బులు, నోట్లు వెళ్తూండగా అటువంటి మాంచి రద్దీలో బేరగాళ్లు గంపలమీదకు యీగల్లా ముసురుతూన్నప్పుడు, లేచి 'రండి' అని అహోబలరావును ఎవరు ఆహ్వానిస్తారు? అతను వట్టి లెక్చరరు. పోనీ ఏ పోలీసు కానిస్టేబన్నా అయితే నలుగురూ ఝడిసి కొంతమన్నన చేసేవారే. తీరా తానుగావెళ్తే టోపీలో పడాలి సొస్తుందేమోనని అను మానం వేసిన మాట మాత్రం నిజం. అంతలో ఒక కొట్టు దగ్గర జనం 'జానకీ! జానకీ' అని సంబోధిస్తూ కూరలకోసం యెగబడాన్ని చూసి, యీ పేరేదో బాగుంది యిక్కడకొంటే మంచిదని లోనికి తొంగి చూశాడు. మనిషి బొగ్గుల బస్తాకు మల్లేవుంది. మెళ్ళోపట్టెడ- కాసుల దండ—ముక్కున నత్తు—చేతిని మురుగులు. వొంటినిండా బంగారంతో కొట్టవచ్చేట్లుగా మాట్లాడుతోంది.

అహోబలరావు వూరుకోవచ్చా—ఏమనుకున్నాడో—ఎదురు గుండా కొట్లోంచి వచ్చే మనుషుల్ని, 'ఎల్లా కొన్నారు? సరిగ్గా తూచిందా? నిన్నట్లానేనా ఏమన్నా ధరలు తగ్గాయా?' అంటూ వాకబులు ప్రారం భించాడు. జానకిని ఆజనం మధ్యనుంచే అహోబలరావు ఆకర్షించాడు. దాన్తోవదిలిందా—'ఆ రాళ్ళు సరేనా—ఆ కాటా అట్లావుందే? తక్కెట్లో దాళవా ఏమన్నావుందా?' అంటూ తన ప్రజ్ఞను వెళ్ళబెట్టబోయాడు. తాట కిలా జానకి కస్సుమని 'ఎందయ్యో—కొన్నావులేగాని ఎల్లు. ఇసుమంటి మాటలాడక. ఎప్పుడన్నా బజారు చేసిన మొహాలేనా-'అంది దురుసుగా. అంతా గొల్లుమన్నారు. అంతట్లోకే అదారినపోతున్న మరో మనిషి నుద్దే శించి 'పోలయ్యా! గంపమీద చెయ్యేసెల్లు. కొనకపోతే మాన్లే-డబ్బుకి

పానానికీ లంకె. నీ సెయ్యి మంచిది బాబో!' అని వొక గావుకేకపెట్టి, చిన్నబుచ్చుకుని వెళ్ళిపోతున్న అహోబలరావు అమాయికత్వాన్ని చూసి జాలిపడినదై దారికడ్డం పడి 'రా అయ్యో! కోపగించి పోతావా తమ్ముడూ! కొనకుండాబోతే సచ్చి నీ కడుపునబుడతా' అని చెయ్యి బుచ్చుకు తీసికెళ్ళి—'ఉప్పు పులుసు తినే పానానికి కోపం రాదయ్యా? నీరాల్లు తక్కెడ తప్పంటివే? నీ అప్పనుకానా- నాను తప్పుడు ముండ ననేగా నీవూసు-' అంది.

అహోబలరావు నవ్వి— "అప్పా! నువ్వు మంచి దానివేలే!" అన్నాడు. "అట్టాగన్ను బాబూ! నీ నాటి దొరబాబులు కోపగిస్తే జానకి సచ్చేనా- బతికేనా?—"

కూరలన్నీ తూచాక డబ్బు లిస్తోంటే జానకి అంది.

"రోజా యిటేరా తమ్ముడూ. డబ్బు లియ్యాల గాకపోతే రేపియ్యి. నీ దయుండాలిగాని జానకి డబ్బు యేటి కెదురీత్తుంది."

అహోబలరావు వెళ్ళొస్తానని యింటిముఖం పట్టాడు. ఈ ఆప్యాయతను అతనిది వరకు ఎక్కడా చవి చూడలేదు. ప్రపంచంలోని ఇన్ని ముఖాలు, ముఖానికో మన స్తత్వం చొప్పున వుంటూంటే జానకిని దేంట్లో జేరిస్తే బాగుంటుందో అతని కెంతవరకూ తట్టలేదు.

## 9

**అహోబలరావును** ఉద్యోగంలో నుంచి వూడపెరికే యత్నంలో విజయం మనద్ది కాబోతున్నదని ప్రసాదరావు శంఖారావం చేసి వెళ్ళాక ముఖ్యంగా ఆనందించినది విజయ తల్లి. దమయంతి విచారంగా "చూడండి. ఒకర్ని నోటివద్ద అన్నాన్ని అధికారమనే చిన్న బెడ్డతో పడగొట్టడం మహాపాపం సుమండీ. పదిమంది కల యిల్లు...." అని వాపోతుంటే తల్లి విసవిసాచేతులాడించుకుంటూ "రైల్లో నాకు జరిగిన అవమానం యింతా అంతా, పుస్తకాలూ కాగితాలు పెట్టెలోంచి గిరవాటేస్తానంది ఆ తింగరది. వాడో-ముక్కు పచ్చలారనిదాన్ని ఆడబిడ్డను నడిరోడ్డులో పడగొట్టి అవమానపరుస్తాడా

స్త్రీల జోలికి పోయినవాళ్ళు అనుభవించాల్సిందే. పెద్దా చిన్నా గౌరవ మర్యాదలెరక్కుండా ప్రవర్తించి నందుకు కావలిసిందే యీ ప్రాయశ్చిత్తం" అంటూ తన అక్కసును వెళ్ళబోసింది. దమయంతి చిన్న బుచ్చుకున్న ముఖంతో అక్కడినుంచి వెళ్ళిపోయింది. ఇంతవరకూ వచ్చాక మనం చేస్తున్నది పాపమేమో అనే చింత విజయకు కూడా కలిగింది. లైబ్రరీనుంచి తెచ్చిన నవలను పూర్తిచేద్దామని పుటలు తెరిచి చదవబోయేసరికి సత్యాహింసలు ప్రపంచశాంతి మీద చెమటోడ్చి ఉపన్యాస మిచ్చే అహోబలరావు దీనవదనమే మాటిమాటికీ విజయ కళ్ళముందు నాట్యమాడసాగింది. పైకి చూస్తే నభోమండలాన నల్లటి కారుమబ్బుల గుంపులు అక్కడక్కడ విచ్చి తెల్ల తెలబడ్తూ కదుల్తూ గోచరించాయి. కాలేజీలకు ఆఫీసులకు వెళ్ళే టైమయింది. అది కుర్ర వాళ్ళు వడివడిగా గడ్డాలకు సబ్బురాసి స్నానాలు భోజనాదికాలు పూర్తి చేసుకునే వేళ....కొందరమ్మాయి లప్పుడే ముస్తాబులకు చివరి తీర్పు లిచ్చే సమయం. విజయకు గుండెల్లో గుబులొచ్చి పడింది. రేపు తనకా కాలేజీతో ఋణం తీరిపోతుందని తెలియని అహోబలరావు చివరి ఉపన్యాసం తను వినటాని కెళ్ళాలి. వెళ్ళి అక్కడ కూర్చోటానికి తన కెంత యినుములాటి కఠినహృదయం కావాలి. రేపు అతను అలో లక్షణా అని వుద్యోగంపోయి యేడుస్తాడు. అతడి క్రొత్త సంసారం కాకులకీ గ్రద్దలకీ అవుతుంది. ఆ కాకులూ గ్రద్దలూ ఎవరు? విజయ గుండె చప్పున ఆగినట్లయింది.

కాలేజీకి వెళ్ళటం కోసం తీసిన పుస్తకాలు బల్లమీద గిరాటు చేసి చేతుల్తో ముఖాన్ని కప్పుకుని కూలబడిపోయింది కుర్చీలో విజయ. కిటికీలోంచి క్రిందకు చూస్తే బయట గోడను బార్ల వేసి వుంచిన తుక్కు తుక్కైన లేడీ సైకిలు 'క్రోధం బహు చెడ్డ వస్తువు సుమా' అని హెచ్చరిస్తోంది. విజయ దిగాలుపడ్డ ముఖంతో అటూ యిటూ తిరుగాడు తూండటాన్ని గమనించిన దమయంతి "కాలేజీకి టైముకాలేదు?లే లేచి అన్నానికిరా" అని ఒకటికి రెండుమార్లు కేకేసింది. విజయ లేచి వంట యింటి గుమ్మంలో కొచ్చి "ఈవాళ కాలేజీకి ఎల్లా వెళ్ళను? వెళ్ళ లేనే అక్కా" అంది కాలితో నేలను వ్రాస్తూ. సరిగ్గా యిదే సమయానికి

విజయ తల్లి చిన్న కూజా బిందెను నీళ్ళతో సహా ఎత్తి కుదేసి లోనికి రొప్పుతూ వచ్చి—"అదే—అదే—అది వచ్చిందే—యింట్లో ఎవరూ లేరే ఎల్లాగే బాబూ!" అని కంగారుగా యిటూ అటూ చూసింది. దమయంతి చెరగు మీదకు లాక్కొని వీధిలో కొచ్చింది. వెనకాలే విజయ నెమ్మదిగా అడుగులో అడుగేసుకుంటూ మెడ రిక్కించి ముందుకు చూసింది.

గేటు వొత్తిగించి నవ్వుతూ అలివేలు "కొత్త చుట్టాన్ని. ప్రసాదరావుగారి మరదల్ని పరిచయం చేసుకుపోదామని వచ్చాను" అంది.

దమయంతి "రండి" అంటూ ఎదురుగావెళ్ళి "మీవారు కాలేజీలో లెక్చరరు గదూ" అని చేయి పుచ్చుకుని మెట్లమీదనుంచి నడిపించు కెళ్ళింది. విజయ తల్లి ఖంగారుగా వెనుకనుంచి విజయను జబ్బ పుచ్చుకులాగుతోంది, లోనికొచ్చెయ్యమని. విజయ తల్లిని దల్చుకొని హాలులోకివచ్చి పచ్చటి పసిమి రంగు చాయతో మెరుస్తూన్న అలివేలు రూపాన్ని తీర్చినట్లు కట్టిన ఆమె కెంపు రంగు చీరను, ముఖాన్ని శుభసంపత్కర చిహ్నంగా దివ్యమంగళకరంగా కనుపిస్తూన్న కుంకుమనూ, ఆశ్చర్యంగా చూడసాగింది.

దమయంతి "ఈ అమ్మాయే మీ వారి శిష్యురాలు" అంటూ పరిచయం చేయబోయింది. అలివేలు "గట్టి శిష్యురాలే—విజయ కదూ మీ పేరు. మీరే కాలేజీలో పనిచేస్తున్నారనుకొని మా వారు పొరబడి ఒక క్లాసు వదిలేసారుట నిజమేనా?" అంది నవ్వుతూ అలివేలు.

విజయ "నిజమే...." అనేసి దగ్గరసా వెళ్ళి ఆమెలోకి చూడ సాగింది. అలివేలు దేనికోసమో వెతుకుతూన్నట్లు చూసి "ఏరి మీ అమ్మగారేరి? వారి యెడల కొంచెం దురుసుగా ప్రవర్తించాను. క్షమించమని అడగాలి" అంటూ లేచింది.

అప్పటికి విజయ తల్లి సొట్టపోయిన బిందెను మెల్లగా వంకరలు దీస్తోంది. అలివేలు చప్పున ఆవిడ రెండు చేతుల్ని పట్టుకుని "పిన్నిగారూ! చిన్నవాళ్ళను మీరు క్షమించాలి. అప్పుడు కొంచెం దురుసుగా ప్రవర్తించిన మాట నిజమే. ఇప్పుడు మీ స్నేహం కోరి వచ్చాను."

విజయ తల్లి క్రిందు మీదై "హాహాహా!" అని మాత్రం అనగలి గింది. దమయంతి "మా యిల్లు చూద్దురుగాని రండి" అంటూ వంట యింటిలోనికి తీసుకపోయి పీటవేసి కూర్చోబెట్టి పుట్టింటా రేవూరో అన్నీ వాకబులు చేయనారంభించింది. తన పుట్టినిల్లు రాజమంద్రి అనీ తన తండ్రి హైస్కూల్లో మాస్టరని అన్నీ చెప్పాక విజయ కేసి తిరిగి "మిమ్మల్ని మాట్లాడించటం ఎట్లాగో నాకు తెలియటం లేదమ్మా. ఎందు కంటే నాకు వచ్చిన చదువు చాకలి పద్దులువరకే—అంతే. ఇవ్వాళ మీరు బడికి పోలేనట్లుంది. బడేమిటి నా మొహం! కాలేజీ అనాలి కామోసు."

విజయ కీమాటు నవ్వు వచ్చింది నిజంగా. "వొంట్లో ఏమీ బాగా లేక వెళ్ళలేదండీ" అంది.

దమయంతి కాఫీ యిచ్చింది. విజయ దొడ్లోనివి పూలుకోసు కొచ్చి "యిందా యివి తీసుకోండి" అంది. అలివేలు కొంచెం గంభీరంగా "అమ్మా నేను నిజంగా నిన్నొకటి యాచించటానికి వచ్చాను. ఆతిథ్యాల్ని స్వీకరించటానికి రాలేదు. కాని మీ మంచి మన స్సులతో యిస్తే అది ఎట్లా కాదనను?" పూలు తీసుగుంది. దమయంతి "ఎందుకండీ అట్లా అంటారు? అది చిన్నపిల్ల. దానికేం తెలుసు?" అలి వేలు నవ్వి "ఇప్పుడీమె యెంత చిన్నపిల్లో యింతకన్నా పదిరెట్ల పసి పిల్ల డొకడున్నాడు మా యింట్లో. అతని చేష్టలవల్ల మీకేమన్నా కష్టం నష్టాలు కలిగితే మన్నించమని అడగటంకోసం వచ్చాను. ఆయన కేమీ తెలియదు. నాకు తెలియనిది ఆయనకు తెలిసినదల్లా ఆ చదువే" అని విజయ రెండు చేతులూ పుచ్చుకుని "యీ చిన్న అక్క కోర్కెను మన్నించవా" అని అడిగింది.

## 10

కాలేజీనుంచి "అదరాబాదరా" యింటి కొచ్చేసరికి గుమ్మానికి పెద్ద తాళం వొకటి వేసివుంది. అహోబలరావుకి అటువంటి సమ

యంలో మొగుడనేవాడికి ఎంత కోపం వస్తుందో అంత కోపం వచ్చింది. అయితే ఆ కోపం ఎట్లాగన్నా బహిర్గతం కావాలి? మరొక్క అసందర్భం ఏమిటంటే తను ఎక్కడికీ కదలవద్దని వార్నింగ్ యిచ్చాడాయె. అప్పటికే తన మాట కెదురు తిరిగి వెళ్ళిపోయింది. అహోబలరావుకి బాగా తెలుసు, తను అనుకున్న పని అలివేలు చేసితీరుతుందని. ఆ వాళ్ళ కొంపకు పడిపోయినట్లుంధి. వెళ్ళి ఏమని చెప్పివుంటుంది. తన భర్త శుద్ధ తెలివితక్కువ వెధవని, తనే మహా గడుసుదాన్ననీ చెప్పివుంటుంది. ఇవన్నీ చెప్పి ఆ అమ్మాయిని రిపోర్ట్‌ను ఉపసంహరించుకోమని అడగటానికే వెళ్ళివుంటుంది. ఎంత అవమానకరమైన పని! ఈ భూ ప్రపంచకంలో మొగుడనేవాడి అజమాయిషీలో వున్న ఆడది చేయవలసిన పనులేనా....ముష్టికి బైలుదేరింది. ఛీ! సుప్రసిద్ధ కాలేజీ లెక్చరరు అహోబలరావు పరువంతా మంటలో కలిసిపోయింది. అయిపోయింది—యింకా కాలేజీ లెక్చరరేవిటి తను? రేపో ఎల్లుండో ఊస్టింగ్ వస్తుంది. ఎందుకొచ్చిన బ్రతుకు? ఛీ! రేపు యీ వూళ్ళో ఏ ఆధారాన్ని నమ్ముకొని వుండటం? అతని కళ్ళముందు భూమి, రోడ్డు రోడ్డుమీద మనుష్యులు అంతా గిరగిరా తిరుగుతున్నారు. డబ్బులేక అగచాట్లుపడే వేలాది అసంఖ్యాక భారత ప్రజల హీనచరిత్ర పుటలు అతని మనఃఫలకాన గబగబా కదుల్తున్నాయ్. కేవలం హైన్యమే అతని కళ్ళముందు తాండవమాడివుంటే ఫరవాలేకపోయేది. అటువంటి హీనస్థితి తనకు వచ్చేసినట్లే—వచ్చి ఎంతో కాలమైనట్లే ఫీలయ్యాడు. అప్పుడిక అలివేలు తన చెప్పు చేతల్లోంచి కట్టలు త్రెంచుకునే ప్రమాదకరమైన వస్తువులా అతనికి గోచరించింది. 'నిజవేరా అబ్బాయి!' అన్నట్లు చింతచెట్లు జడలు విరబోసుకుంటున్నాయి. చీకట్లు ముసురుతున్నాయ్. అహోబలరావు పళ్ళు పటపటా కొరికాడు. వెర్రి ఆవేశ మెత్తిపోతోంది. గుమ్మంలో చతికిలపడి గ్రుడ్లు పెద్దవి చేసుకుని మనస్సు అన్యాక్రాంతం

చేసి చూడసాగాడు. అటువంటివాడికి చూపు యేమి అన్తుంది? ఎదురుగుండా రిక్షా ఆగటం అందులోనుంచి మనుష్యులు తన వైపుకు రావటం కూడా అతనికి తెలియదు. బాగా దగ్గరసా వచ్చి తలుపు తాళం తీస్తుండగా తెలివొచ్చింది అహోబలరావుకి. ఆ మనిషి అలివేలులా గనుపించి వూచి పుచ్చుకు లెంపకాయ కొట్టాడు. 'అమ్మా!' అని అలివేలు గోడ మీదకు త్రూలింది. గోడనున్న మేకు కణతలకు తగిలి గాయ మేర్పడింది. ఇది గమనించని అహోబలరావు "ఎక్కడ కెళ్ళావే—రాక్షసీ? వెళ్ళొద్దన్నానా—" అని మళ్ళీ చేయెత్తాడు. వెనకనుంచి అతని ఎత్తి చేతిని ఎత్తినట్లే ఒక అమృతహస్తం గట్టిగా పట్టుకుంది.

అప్పుడు అహోబలరావు ఆ అమృత హస్తాన్ని తన వైపుకు త్రిప్పుకుని కళ్ళల్లోకి కళ్ళుపెట్టి చూశాడు. వి....జ....య! గప్పున చేయి వదిలేసి వి....జ....యా అని వెనక్కు గెంతాడు. గుమ్మం దగ్గిర కూలబడ్డ అలివేలు కుడిచేత్తో కణత వొత్తుకుంటూ—"ఇక పరిహాసం చాలించండి. మా చెల్లెల్ని రెండవమారు అవమానించ దల్చుకున్నారా? వచ్చి తలుపుతీసి దీపం వెయ్యండి."

అహోబలరావు కిక్కురు మనకుండా తాళంతీసి లోపల ప్రవేశించి లైటు వేశాడు. అలివేలు చెంపనుండి నెత్తురు కారుతోంది.

విజయ కోపంగా మాష్టారికేసి చూసి "నేను వెళ్ళిపోతాను. తలకు కట్టు కట్టుకో" అంది. అలివేలు చేయి పుచ్చుకుని "మరో మాటు మా సంసారాన్ని చూద్దువుగాని కాని వొక్కర్తివే వెళ్ళలేవు. దయచేసి మీ రామెను యింటివరకూ దిగబెట్టిరారూ? ఏమిటి అట్లా చిన్నబుచ్చుకున్నారే నిల్చొని. నాకు దెబ్బ తగిలిందనా—యివాళ నా కెంత ఆనందంగా వుందని. ఈ బాధను నే నెంతో పౌరుషంగా అనుభవిస్తాను. వెళ్ళండి" అని బ్రతిమాలింది.

అహోబలరావు విజయను వెంటబెట్టుకొని వెళ్తున్నాడు. విజయ యిక వుండబట్టలేక యింటిదాకా వెళ్ళాక— "మాస్టారూ—ఆవిడ మిమ్మల్నెంత యిదిగా ప్రేమిస్తోందో మీకు తెలుసా?" అని అడిగింది. "ఆ మాటనకు విజయా. ప్రేమ ఎట్లాటిదో నా కిప్పటికీ తెలియదు" అన్నాడు. విజయ అతని ముఖానికేసి తేరిపారచూసింది. అప్పటికే అతని ముఖం చెరువయి చెంపలన్నీ తడిసిపోయి వున్నాయి.

---